ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు

జిల్లా వార్తలు

5

మంగళవారం 27 మే 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 26.0

యోగాతో శారీరక, మానసికోల్లాసం : కలెక్టర్

ఏలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : యోగాను క్రమం తప్పకుండా సాధన చేస్తే శారీరక, మానసికంగా ఉల్లాసంగా ఉంటామని కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. టీటీడీసీలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయా శాఖల ఉద్యోగుల యోగాభ్యాస కార్యక్రమం కింద సోమవారం రెవెన్యూ ఉద్యోగులతో కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 20వ తేదీ వరకు యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 28న డీఆర్డీఏ, 29న విద్యుత్, 30న డ్వామా, 31న ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, జూన్ 2న ఎక్సైజ్, 3న బ్యాంకింగ్, 4న ఉద్యానశాఖ, 5న హౌసింగ్, 6న ఇరిగేషన్, 7న డీఎంహెచ్‌వో, 9న మెప్మా, 10న మున్సిపల్‌శాఖ, 11న పంచాయతీరాజ్, 12న జైళ్లశాఖ, 13న సోషల్ వెల్ఫేర్, 14న సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, 16న ఐసీడీఎస్, 17న జడ్పీ, 18న సర్వేఅండ్ ల్యాండ్ రికార్డ్సు, 19న స్కిల్ డెవలప్‌మెంట్, 20న పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగులతో యోగాభ్యాసన కార్యక్రమాలతో నిర్వహిస్తామన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య, ఏలూరు, పెదపాడు తహసీల్దార్లు జీవీ శేషగిరి, కృష్ణజ్యోతి, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా రిజిస్ట్రేషన్లు వేగవంతం : జేసీ

యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలను విస్తృతంగా చేర్చేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని జేసీ ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని నాలుగు చారిత్రక ప్రదేశాల్లో యోగా శిబిరాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయాలన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏలూరులో నేడు యోగా ర్యాలీ

ఏలూరు టూటౌన్, మే 26(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 27వ తేదీ ఉదయం 8 గంటలకు ఇండోర్ స్టేడియం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వెయ్యి మందితో సామూహిక యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నగర కమిషనర్ కె.భానుప్రతాప్ తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సిబ్బంది, నగర ప్రజలు పాల్గొనాలని కోరారు.

నేడు ఉమ్మడి జిల్లా హెచ్‌ఎం పదోన్నతులకు ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్

■ లోపలి పేజీలో..





మహానాడు వేదిక వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు..ఆవకాయ పచ్చడిని కలుపుతున్న దెందులూరు,తణుకు ఎమ్మెల్యేలు చింతమనేని, ఆరిమిల్లి

పసుపు సంబరం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఉమ్మడి జిల్లా నుంచి కదిలిన కేడర్

- కడపలో కదం తొక్కేందుకు ఉత్సాహం
- మంత్రుల నియోజకవర్గాల్లో ప్రత్యేక పర్యవేక్షణ
- మంత్రి నిమ్మల, కొలుసు, పితానితో సహా పలువురి మకాం
- ఆంధ్రా ఆవకాయ పట్టిన చింతమనేని, ఆరిమిల్లి
- ప్రత్యేక బస్సులు, కార్లలో పసుపు దండు
- నియోజవర్గాలకు మహానాడు ఫీవర్

పసుపు పండుగ స్వయంగా తిలకించాలన్న ఉత్సాహం తెలుగు తమ్ముళ్లలో ఉరకలెత్తుతోంది. కడప గడపకు వెళ్లి తెలుగుతేజం, పౌరుషం చూపించాలని ఆత్రుతతో ఉన్నారు. భారీ వర్షాలు పడతాయన్న భయంలేదు. మహానాడు జరిగే ప్రాంతం సుదూరం అని ఏ ఒక్కరిలోనూ జంకు లేదు. పల్లె, పట్టణం తేడా లేకుండా తెలుగు తమ్ముళ్లు అంతా సోమవారం ఉదయం నుంచే మహానాడుకు పయనమయ్యారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు కడపకు చేరుకుని తమ అప్పగించిన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కడపలో జరుగుతున్న మహానాడు విజయవంతం కావడానికి పార్టీ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. కడప దూరాభారమైనా యువ కార్యకర్తలు ఖాతరు చేయకుండా మహానాడుకు హాజరు కావాల్సిందేనన్న పట్టుదలతో ఉన్నారు. మంగళవారం నుంచి జరిగే ప్రతినిధుల సభలో రాష్ట్రవ్యాప్తంగా పాతికవేల మంది హాజరవుతుండగా, ఉమ్మడి పశ్చిమ నుంచి మూడు వేల మంది మహానాడు ప్రాంగణానికి చేరారు.

మహానాడు దారిలో పార్టీ శ్రేణులు

మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లు, నూజివీడు నియోజవర్గాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు మహానాడుకు బయల్దేరారు. ఎక్కువ దూరం ప్రయాణించాల్సి ఉన్నందున సీనియర్ కార్యకర్తలంతా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసుకున్నారు. నూజివీడు నుంచి మూడు బస్సులు బయల్దేరగా వందకు పైగా కార్లలో మరికొందరు వెళ్లనున్నారు. మంత్రులు రామానాయుడు, పార్థసారథి తమ నియోజకవర్గాల నుంచి కడపకు బయల్దేరే కేడర్‌కు ఎలాంటి సౌకర్యాలు అందుతున్నాయో ప్రత్యేక దృష్టిపెట్టారు. పొలిట్ బ్యూరో సభ్యుడు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తన నియోజకవర్గం నుంచి కేడర్ కడపకు చేరుకునేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు తన నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, కేడర్ మహానాడుకు వెళ్లేలా స్వయంగా పర్యవేక్షించారు. దెందులూరు నుంచి చింతమనేని కేడర్ అంతా ఉత్సాహంగా మహానాడు వైపు కదిలారు. ఏలూరు నుంచి పార్టీ సీనియర్లు సమన్వయం చేసుకుని ఎమ్మెల్యే బడేటి చంటి నేతృత్వంలో మహానాడుకు వెళ్లేలా ఏర్పాట్లు చేసుకున్నారు. భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, ఉండి, కైకలూరు, పోలవరం, చింతలపూడి, ఉంగుటూరు నియోజకవర్గాల నుంచి వందలాది మంది మహానాడుకు ఇప్పటికే బయల్దేరి వెళ్లారు. 29న బహిరంగ సభ జరగనుండగా, అంతకంటే ఒక రోజు ముందుగానే కడపకు వెళ్లి తీరాల్సిందేనన్న పట్టుదలతో అంతా ఉన్నారు.



కలిదిండి నుంచి మహానాడుకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు

ఆవకాయ.. మజాకా

మహానాడు నిర్వహణకు వీలుగా టీడీపీ 19 కమిటీలను నియమించింది. ఆహార కమిటీలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను నియమించారు. ఆవకాయను తయారు చేయడానికి వీలుగా మామిడి ముక్కలు కొట్టేవారి నుంచి పచ్చడి పట్టేవారిని సైతం ప్రత్యేక బస్సుల్లో చింతమనేని తనతో తీసుకెళ్లారు. ఆయనతో పాటు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి ఆవకాయ తయారీలో చేయి కలిపారు. పార్కింగ్ ఏర్పాట్లలో మాజీ ఎమ్మెల్సీ పాందువ్వ శ్రీను, ఏపీ ఐబీసీ ఛైర్మన్ రామరాజు, సభ పర్యవేక్షణ, ఇతర ఏర్పాట్లలో మంత్రి రామానాయుడు, కొలుసు, పితాని, సీతారామలక్ష్మితో సహా మిగతా సీనియర్లు బిజీగా ఉన్నారు.

31 నుంచి పోస్టల్ బ్యాంకు ఖాతా తెరిచేందుకు స్పెషల్ డ్రైవ్

ఏలూరు అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం అమలు చేయనున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడానికి వీలుగా వారి ఖాతాలను ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) విధానం కింద ఆధార్ నెంబరుతో అనుసంధానం (మ్యాపింగ్) చేసుకోవాలని తపాలాశాఖ ఏలూరు డివిజన్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీకర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు ఖాతాలతో ఆధార్ నెంబరు లింక్ అయిన లబ్ధిదారులకే ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు జమ అవుతుందన్నారు. అర్హులు సమీప గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది వద్దకు వెళ్లి ఎన్‌సీపీఐతో బ్యాంకు ఖాతాలను ఆధార్ సీడింగ్ చేయించుకోవాలన్నా రు. ప్రస్తుతం జిల్లాలో ఇంకా 7వేల మందికి సంబంధించి బ్యాంకు ఖాతాలకు ఆధార్ సీడింగ్ జరగలేదని గుర్తించామన్నారు. ఇంతవరకు బ్యాంకుఖాతా లేని వారికోసం కేవలం రూ. 200లతో తపాలాశాఖ అనుబంధ సంస్థ ఐపీపీబీ (ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంక్) ఖాతాను తెరిచి, ఎన్‌పీసీఐకి ఆధార్ లింక్ చేసుకునేందుకు జిల్లాలోని అన్ని పోస్టాఫీసుల్లో ఈ నెల 31 నుంచి జూన్ 4వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వివరా లకు ఏలూరులోని ఐపీపీబీ సీనియర్ బ్రాంచి మేనేజర్ కె.రాజేశ్‌ను ఫోన్ నెంబరు 78934 36211లో సంప్రదించాలని కోరారు.

ఏలూరులో భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు

ఏలూరు క్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలో భారీ వాహనాలు ఎప్పుడుపడితే అప్పుడు రావడానికి అనుమతులు లేవని ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.లక్ష్మణరావు అన్నారు. నగరంలో భారీ వాహనాలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాకూడదని మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తిరగడానికి అనుమతులు ఉన్నాయన్నారు. తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నగరంలోకి ప్రవేశం లేదని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు నగరం మీదుగా వెళ్లడానికి అనుమతులు ఉన్నాయన్నారు. నగరంలో ఎక్కడబడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తే జరిమానాలు విధిస్తామన్నారు. మైనర్ బాలలు మోటారు సైకిళ్లు నడిపితే వారితో పాటు తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

భారీ వర్ష సూచనలు.. జిల్లా యంత్రాంగం అప్రమత్తం

ఏలూరు సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో ఈనెల 27వ తేదీ నాటికి ఏర్పడుతున్న అల్పపీడనం కారణంగా జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్రంలో రానున్న నాలుగు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ చేసిన హెచ్చరికల దృష్ట్యా జిల్లాలోని అన్ని శాఖ ల అధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి అప్రమత్తం చేశారు. మంగళవారం జిల్లాలోని పలు చోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చ రించిందని పేర్కొన్నారు. ఉద్యానవన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే లోతట్టు ప్రాం తాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా రెవెన్యూ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదే శించారు. ఎటువంటి అంతరాయాలు లేకుండా నిరంత ర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ సాల్మన్‌రాజును ఆదేశించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటలలో జిల్లాలోనే అత్యధికంగా పెదపాడు మండలంలో 36.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 3.7 మి.మీ నమోదైంది. జీలుగుమిల్లి 12.2, వేలేరుపాడు ముదినేపల్లి 7.4, కుక్కునూరు 7, పోలవరం 5.8, కామవరపుకోట 5.4, ఆగిరిపల్లి 5.2, మండవల్లి 3.6, ఏలూరు రూరల్ 3.4, భీమడోలు 2.6, ద్వారకాతిరుమల 2, జంగారెడ్డిగూడెం 1.8, ఏలూరు అర్బన్ 1.6 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

సీసీఆర్‌సీ కార్డుల లక్ష్యాన్ని సాధిస్తాం..

జిల్లాలో పంటసాగుదారు హక్కుల పత్రం (సీసీఆర్‌సీ), అన్నదాత సుఖీభవ పథకాల కింద నిర్దేశించుకున్న లక్ష్యాలను నిర్దిష్ట సమయంలో సాధిస్తూ జిల్లాని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ శాఖాధికారులతో వెబ్ ఎక్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 75 వేల సీసీఆర్‌సీ కార్డులు మంజూరు లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద 4,03,093 రికార్డుల పరిశీలన లక్ష్యంగా ఇంతవరకు 3,60,731 రైతుల వివరాలను పరిశీలన పూర్తయిందన్నారు.

రిటైర్డు జవాన్లకు ద్రోహం

- ఎఫ్‌సీఐ గొడౌన్లలో సిబ్బందికి వేధింపులు
- నెలనెలా మామూళ్లు ఇవ్వాలని బెదిరింపులు
- డిపో మేనేజర్‌కు సూపర్‌వైజర్లు, గార్డుల ఫిర్యాదు

తీరాన్ని తాకిన జోగి అక్రమాలు

- 30 ఎకరాల ప్రభుత్వ భూమి అమ్మకానికి సిద్ధం
- నమ్మించి మోసం చేశాడు : లీలాప్రసాద్

■ లోపలి పేజీలో..

మామిడి ధరలు పతనం కావడంతో రైతు లు గగ్గోలు పెడుతున్నారు. బంగినపల్లి మామిడి టన్ను రూ.15 వేలు, తోతాపురి (కలెక్టర్) రకం టన్ను రూ.ఐదు వేలకు పడిపోయింది. సీజన్ ప్రారంభంలో బంగినపల్లి టన్ను సుమారు రూ.లక్ష పలుకగా కలెక్టర్ రకం టన్ను దాదాపు రూ.50 వేలు వరకు పలికింది. కనీసం కోత కూలీ, రవాణా ఖర్చు లు చేతికి రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.



చాట్రాయిలో మామిడి కాయల రాశులు

మామిడీలా..

- ధరలు భారీగా పతనం..
- కోత కూలీ, రవాణా ఖర్చులూ గగనమే..
- తీవ్రంగా నష్టపోయాం : రైతుల ఆవేదన

చాట్రాయి/నూజివీడు టౌన్ మే 26 (ఆంధ్రజ్యోతి): మామిడి సీజన్‌లో ఏటా ఏప్రిల్ నుంచి మే వరకు జ్యూస్ ఫ్యాక్టరీలు ఎగబడి కొనడం వల్ల మార్కెట్‌లో ధరలు నిలకడగా ఉండేవి. అయితే ప్రస్తుత సీజన్‌లో జ్యూస్ ఫ్యాక్టరీల (పల్ప్ పరిశ్రమ)లో నిల్వలు పేరుకుపోయి ఉండడంతో ప్రస్తుత సీజన్‌లో కొనుగోలుకు ముందుకు రాలేదు. దీనికి తోడు మంగు తెగులు, కోడిపెను ఎక్కువగా ఉండడం, ఢిల్లీ సేట్‌ల మార్కెట్ మాయాజాలంతో భారీగా ధరల పతనమైనట్టు చెబుతున్నారు. మరోవైపు అధిక దిగుబడులు ఆశించిన రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందులు విచక్షణా రహితంగా వినియోగించడంతో మామిడి పంటకు ముప్పు వచ్చింది. మంగు తెగులు ఆశించి కాయ నాణ్యత తగ్గిపోయి ధరలు పతనమై ఎగుమతులు ఆగిపోయాయి. మామిడి ధరల పతనానికి అకాల వర్షాలు మరో కారణంగా చెప్పవచ్చు. మే ప్రారంభం నుంచి వర్షాలు పడడంతో మామిడి నాణ్యత దెబ్బతింది.

ఆదుకుంటున్న ముక్కల పరిశ్రమ

కలెక్టర్ రకం మామిడికి ముక్కల పరిశ్రమ ఒక్కటే దిక్కైందని చెప్పవచ్చు. మ్యాంగో పల్ప్ యూనిట్ పరిశ్రమ నిర్వాహకులు మామిడి కొనుగోలు చేయకపోవడంతో కలెక్టర్ రైతులను ముక్కల పరిశ్రమ ఆదుకుంటోంది. నూజివీడు పరిసరాల్లో దాదాపు నాలుగు పరిశ్రమలు ఉండగా గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఇటు కలెక్టర్ రైతులకు కొంత మేర మార్కెట్‌ను అందిస్తోంది.



ముక్కల పరిశ్రమలో కలెక్టర్ కాయల ప్రాసెస్

ప్రత్యామ్నాయ పంటల వైపు..

మామిడి సాగులో వరుస నష్టాలు వస్తుండడంతో చాలామంది రైతులు మామిడి తోటలు నరికి మొక్కజొన్న పామాయిల్ సాగు చేస్తున్నారు. కొన్నేళ్ల క్రితం వరకు చాట్రాయి మండలంలో 25 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉండేవి. ప్రస్తుతం మండలంలో సుమారు 7 వేల ఎకరాల్లో మాత్రమే తోటలు మిగిలాయి. ఇదే పరిస్థితి కొనసాగితే మామిడి తోటలు పూర్తిగా కనుమరుగవుతాయని రైతులు వాపోతున్నారు.

మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి



మామిడి పంటకు ప్రభుత్వం మార్కెటింగ్ సదుపాయం కల్పించి, గిట్టుబాటు ధర అందించకపోతే మామిడి సాగుకు మనుగడ ఉండదు. ఆరుగాలం కష్టపడి పండించి మార్కెట్‌కి తీసుకువెళితే అరకొర ధర వస్తోంది. కోత కూలీ, రవాణా ఖర్చులూ చేతికి రావడం లేదు. నష్టాలు భరించే స్థితిలో రైతులు లేరు. ప్రభుత్వం దీనిపై పరిశీలన చేసి మామిడి రైతులను ఆదుకోవాలి.

- ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, మామిడి రైతు, ఆరుగొలనుపేట, చాట్రాయి మండలం

ఉద్యోగాల పేరిట మోసగిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ వెట్రిసెల్వి.. 267 అర్జీల స్వీకరణ

ఏలూరు రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసాలకు పాల్పడేవారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి హితవు పలికారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 267 అర్జీలు స్వీకరించారు. విభిన్న ప్రతిభావంతుల వద్దకే కలెక్టర్ వచ్చి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కార చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్, దేవకిదేవి, శ్రీనివాస్‌రెడ్డి వినతులు స్వీకరించారు. కామవరపుకోట మండలం రామన్నపాలెంకు చెందిన వ్యక్తి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.3లక్షలు తీసుకుని మోసగించాడని, న్యాయం చేయాలని టి.నర్సాపురం మండలం బొర్రపాలెంకు చెందిన తోట రమేష్ అర్జీనిచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ ఇటువంటి మోసాలకు పాల్పడే వారిపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కాగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా 39 మంది ఫిర్యాదు దారులు తమ సమస్యలపై ఫిర్యాదు చేశారు. జిల్లా అర్మ్‌డు రిజర్వు అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి త్వరితగతిన విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు

నిఘా నేత్రాలు

నేరస్తులను కనిపెట్టేందుకు ఫేస్ రికగ్నైజేషన్ కెమెరాలు

■ లోపలి పేజీలో..

ఆకలి రుచి ఎరగదు..నిద్ర సుఖమెరగదు అంటారు.. అలిసిపోయిన జీవితాలకు కాస్తంత జాగా దొరికితే చాలు కునుకు తీద్దామనిపిస్తుంది.. గూడు లేనివారికి ఫుట్‌పాత్‌లే ఆవాసం..బండ్లపై వ్యాపారాలు చేసుకునేవారు కొందరు రాత్రయ్యేసరికి అన్నీ సర్దుకుని పక్కనే పక్కేసుకుని పడుకుంటారు.. ఫ్యాన్ లేకపోయినా.. దోమలు కుడుతున్నా నిద్ర ముందు బలాదూరే.. ఏలూరులోని తంగెళ్లమూడి ఫుట్‌పాత్, ఆర్టీసీ బస్టాండ్, ఫైర్‌స్టేషన్ ఫ్లైఓవర్ వద్ద నిరాశ్రయుల దుర్భర పరిస్థితి ఇదీ..

- ఫొటోగ్రాఫర్, ఏలూరు

అభాగ్యులు





పాత బస్టాండ్ సమీపంలో దోమలకు పొగ పెట్టుకొని నిద్రిస్తున్న చిరు వ్యాపారులు

ఆర్టీసీ బస్టాండ్‌లో దోమల తెర కప్పుకుని..



ఫైర్‌స్టేషన్ సర్కిల్ ఫ్లైఓవర్‌పై గాఢనిద్రలో..




తంగెళ్లమూడి తమ్మిలేరు బ్రిడ్జి ఫుట్‌పాత్ పై



ముగిసిన సప్త కోటి రామలింగేశ్వరస్వామి దర్శనం

పెనుమంట్ర, మే 26(ఆంధ్రజ్యోతి) : వైశాఖ మాసంలో చివరి సోమవారం కావడంతో పెనుమంట్ర మండలం నత్తా రామేశ్వరంలోని పరశురాముడు ప్రతిష్ఠించిన సప్తకోటి రామ లింగేశ్వర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. సోమవారం శివునికి ప్రీతికరమైన రోజు కావడంతో వేకువ జాము నుంచి భక్తులు స్వామి అభిషేకాలకు బారులు తీరారు. ఆలయ అర్చకులు భాస్కర్ శర్మ, కాశీభట్ల సూర్యనారాయణమూర్తి స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 10 నుంచి గరువు మాజీ సర్పంచ్ కర్రీ సుబ్బారెడ్డి భారీ అన్న సమారాధన నిర్వహించగా భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో వేణుగోపాల్ ఏర్పాట్లు చేశారు. మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సతీమణి అనంతలక్ష్మి, వెంకట్ సతీమణి నాగ సాహితీ తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. పరశురాముడు ప్రతిష్ఠించిన శివలింగం వైశాఖ మాసం నెల రోజులు మాత్రమే భక్తులకు దర్శనమిస్తారు.వైశాఖ మాసం అమావాస్య తిది కావడంతో ఉదయం స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చి మధ్యాహ్నం మహానివేదన అనంతరం నీటితో నింపుతారు. మళ్లీ స్వామి దర్శనం లభించాలంటే వైశాఖ మాసం రావాల్సిందే..



పుష్కరాల్లో బ్రాహ్మణ ట్రస్టు అన్నదానం

ఇప్పటి వరకూ సుమారు లక్షన్నర మందికి పైగా భోజనం వితరణ

ద్వారకాతిరుమల, మే 26(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమంలో జరుగుతున్న సరస్వతీ పుష్కర భక్తులకు గత 12 రోజులుగా ద్వారకాతిరుమల బ్రాహ్మణ నిత్యాన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరుగుతోంది. ఈ పుష్కరాల్లో ఆఖరి రోజైన సోమవారం కూడా దాదాపు 14వేల మందికి పైబడి భక్తులకు ఉచితంగా ఆంధ్రా భోజనాన్ని అందించారు. ప్రతీ పుష్కరాలకు ఇలా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత అన్నప్రసాద వితర ణ చేస్తున్నట్టు ట్రస్ట్ చైర్మన్ వెంపరాల నారా యణమూర్తి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఈ కా ర్యక్రమం 1991లో గోదావరి పుష్కరాల సమ యంలో ప్రారంభించామన్నారు. 1991, 2003, 2015 సంవత్సరాల్లో జరిగిన గోదావరి పుష్కరా ల్లో, 1992, 2004, 2016లో జరిగిన కృష్ణా పుష్కరాల్లోను, కావేరి, భీమ, ప్రాణహిత, గంగ, నర్మద, సరస్వతితో పాటు ఇది 12వ పుష్కరమని పేర్కొన్నారు. ఈ పన్నెండు సార్లు పుష్కరాల్లో తమ ట్రస్టు సభ్యులు, దాదాపు 30మంది దాతల సహకారంతో అన్నప్రసాద వితరణను చేపట్టినట్టు తెలిపారు. ఇప్పటి వరకూ దాదాపు లక్షన్నర మంది పుష్కరభక్తులకు మంచి భోజనాన్ని అందించినట్టు చెప్పారు. సరస్వతి పుష్కరాలకు ద్వారకాతిరుమల ట్రస్టు నుంచి 40 మంది పనివారిని, సిబ్బందిని తీసుకెళ్లి అక్కడి వాసవీ కన్యకా పరమేశ్వరి సత్రంను అద్దెకు తీసుకుని స్వీట్లు, హాట్లతో ఆంధ్రాభోజనాన్ని పుష్కర భక్తులకు అందిస్తున్నామని మూర్తి వివరించారు. సేవాభావమే పరమావధిగా తాము ఈ కార్యక్రమాన్ని ప్రతి పుష్కర సమయంలో నిర్వహిస్తున్నామన్నారు.



అన్నదానం చేస్తున్న బ్రాహ్మణ ట్రస్టు సభ్యులు

జీవన చిత్రం

మెరుగు పడని జీవితాలు



బంగారు నగల అలంకరణ భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుంది. మహిళలు నగలు ధరించేందుకు ఉత్సాహం చూపుతారు. ధర పెరుగుతున్నా ఎంతోకొంత బంగారం ఒంటిపై ఉండాలనే సంప్రదాయం కారణంగా బంగారానికి డిమాండ్ తగ్గడం లేదు.. కానీ బంగారానికి మెరుగులు పట్టి అందమైన వస్తువులుగా మలిచే స్వర్ణకారుల జీవితాలు మాత్రం నానాటికీ దుర్భరంగా మారుతున్నాయి. తరతరాలుగా ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారు వృత్తిని వదులు కోలేక, వేరే వృత్తుల్లోకి వెళ్లలేక అవస్థలు పడుతున్నారు.

- స్వర్ణకారుల బతుకుల్లో చీకట్లు
- రెడీమేడ్ నగలపై ప్రజల మక్కువ
- బంగారం ధర పెరగడంతో తగ్గిన పనులు
- ఆర్థిక ఇబ్బందులతో చితికిన కుటుంబాలు
- ఇతర వృత్తుల్లోకి వెళ్లలేక సతమతం

పాలకొల్లు అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): బంగారం, వెండి ధరలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములు సుమారుగా రూ.95 వేలకు పైగా చేరింది. అదే వెండి ధర కూడా కిలో రూ.1 లక్ష కావ డంతో వినియోగదారులు ఆసక్తి కనపరచక పోవడంతో స్వర్ణకారులకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రోల్డ్ గోల్డ్ (గిల్టు) నగలపై మహిళలు మక్కువ చూపుతున్నారు. దీంతో స్వర్ణకారులు దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. పూర్తిస్థాయిలో పనులులేక పూట గడవని పరిస్థితుల్లో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పడుతున్న కష్టాలు తమ పిల్లలు పడకూడదని పిల్లలను ఈ వృత్తిలో ప్రవేశపెట్టడం లేదని పలువురు స్వర్ణకారులు చెబుతున్నారు. ఉన్నంతలో ఎంతో కొంత చదివించాలని భావిస్తున్నారు. పెద్దగా చదివించలేకుంటే వేరే వృత్తుల్లోకి పంపుతున్నారు.



వెండి, బంగారు ఆభరణాలు చేస్తున్న పాలకొల్లు స్వర్ణకారులు

పాలకొల్లుకు పేరు..

పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో సుమారు 600 మంది బంగారం, వెండి వస్తువులు తయారు చేసేవారు ఉన్నారు. ఇక్కడ తయారు చేసే బంగారు, వెండి వస్తువులు ఎంతో నైపుణ్యంగా చేస్తారన్న పేరు ఉండటంతో దూర ప్రాంతాల నుంచి కూడా వచ్చి వస్తువులు తయారు చేయిం చుకుంటారు. ఆలయాల శిఖరాలకు, దేవుడి విగ్రహాలకు అలంకరణ వస్తువులు నగలు తయారు చేసేవారు పలువురు గుర్తింపు తెచ్చుకున్నారు. ఇక్కడ తయారు చేసే వస్తువులు పలు రాష్ట్రాల వారు కొనుగోలు చేయడం, లేదా ఆర్డర్ ఇవ్వడం చేస్తుంటారు. పనులు లేక పోవ డంతో దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షుగా ఉందని పలువురు స్వర్ణకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బంగారు నగలు తయారు చేసే వారిలో అత్యధికులు విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారు (కంసాలి) ఉండగా వెండి నగలు, నగిషీ పట్టడం వంటి పనులు ఇతర సామాజిక వర్గంతో పాటు ముస్లింలు కూడా చేస్తుంటారు. గతంలో ఎంతటి సున్నితమైన నగలు అయినా బంగారాన్ని కాల్చి తీగలుగా, బిళ్లలుగా తయారు చేసేవారు. వాటితో ఎంతో నైపుణ్యంగా, నాణ్యతగా వస్తువులు తయారు చేసేవారు. ఇటీవల అత్యాధునిక యంత్రాలు రావడంతో చాలామంది యంత్రాలను విని యోగిస్తున్నారు. అయితే యంత్రాల కొనుగోలుకు ఆర్థిక స్తోమత లేని వారు యంత్రాలు ఉన్నవారి వద్ద దినసరి వేతనాలకు పనిచేస్తున్నారు. గతంలో తయారు చేసే నగలను టంకం శాల్తీలుగా పిలిచేవారు. వాటి తయారీకి ఎంతో శ్రమ ఉండేది. అయినప్పటికీ ఆ పనుల్లో వారికి గిట్టుబాటు ఉండేదని, కేడీఎం పేరుతో తయారు చేసే వస్తులు (నగలు) రావడంతో ప్రస్తుత రోజుల్లో గిట్టు బాటు కావడం లేదని పలువురు స్వర్ణకారులు వాపోతున్నారు.

• యంత్రాల ధరలు అధికంగా ఉన్నాయి



బంగారం ధర పెరిగిపోవడంతో వ్యాపారం సరిగా ఉండటం లేదు. రెడీమేడ్ వస్తువుల విని యోగం బాగా పెరిగింది. స్వర్ణకారులు తయారు చేసిన నగలపై వినియోగ దారులు ఆసక్తి కన పరచడం లేదు. గోల్డ్ చెకింగ్ మిషన్లు (టచ్ మిషన్లు) మార్కెట్‌లోకి రావడంతో బంగారం నాణ్యత పెరిగింది. అయితే బంగారం ధర అధికంగా పెరగడంలో టచ్ మిషన్లు పట్టణాలు, నగరాలకే పరిమితమైపోతున్నాయి. చిన్న పట్టణాలలో కూడా ఈ మిషన్లు ప్రవేశపెట్టాలి.

-మందపాక శివ వరప్రసాద్ (రాజా), అధ్యక్షుడు, స్వర్ణకార సంఘం, పాలకొల్లు

• పనుల్లేక పస్తులు ఉంటున్నాం



వినియోగ దారులు బంగారు వస్తువులు తయారు చేయించుకోవడం లేదు. రెడీమేడ్ వస్తువులకే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో స్వర్ణకారుల్లో 60 శాతం మంది పనుల్లేక పస్తులుంటున్నారు. రెడీమేడ్ వస్తువుల్లో నాణ్యత పెద్దగా ఉండదు. మా పెద్దల నుంచి ఈ వృత్తిపైనే జీవిస్తున్నాం. దీనిపై సరైన సంపాదన లేకపోయినా వదులుకోలేక ఇందులోనే కొనసాగుతున్నాం. ఎంత నైపుణ్యం ఉన్నా నిర్వీర్యం అవుతోంది. చేతితో తయారైన వస్తువులుకు ఉన్న నాణ్యత యంత్రాలపై తయారు అయిన వస్తువులకు ఉండదు.

-పట్నాల మురళీ, స్వర్ణకార వృత్తిదారుడు, పాలకొల్లు

చింతచెట్టు చిగురు చూడు



- ఔషధాలు కలిగిన ప్రకృతి వనరు
- వివిధ రకాల కూరల్లో వినియోగం
- పల్లెల్లో వేసవిలో విరివిగా లభ్యం
- పట్టణాల్లో విక్రయాలు



తణుకు రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): చింత చెట్టు చిగురు చూడు... చిన్న దాని పొగరు చూడు.. అని ఒక సినిమా కవి పాటలో రాసినట్లుగా చింతచిగురు తెలుగు సంస్కృతిలో ఎంతో ప్రాచుర్యంలో వున్న ప్రకృతి వనరు. ఇది ఆహార పదార్థాల్లో కలిపే ఆకు మాత్రమే కాకుండా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలిగిన ఔషధ వనరు. మన ప్రాంతంలో వేసవిలో చింతచెట్లకు వచ్చే చిగురును శాఖాహార, మాంసాహార కూరల్లో ఎక్కువగా ఉపయోగిస్తారు. పల్లెల్లో చెట్ల నుంచి చింత చిగురును సేకరించి పట్టణా ల్లోని రోడ్లపక్కన అమ్మకాలు చేస్తున్నారు. ఔషధ గుణాలతో పాటు విటమిన్లు, మెగ్నీషయం, ఇనుము, కాల్షియం వంటి ఖనిజాలు ఇందులో సమృద్ధిగా వుంటాయి. వీటితో పాటు ఫైబర్, ప్రొటీన్, యాంటీ ఆక్సిడెంట్లు, వంటి ముఖ్యమైన పోషకాలు వున్నాయని పోషకాహార నిపుణులు చెబు తున్నారు.ఈ చింత చిగురును కూరల్లోనే కాకుండా చట్నీగానూ, పొడిగాను చేసుకుని వాడవచ్చు. ఆయుర్వేదంలో చింత చిగురును ముఖ్య మైన పదార్థంగా వినియోగిస్తారు. చింత చిగురును ఎక్కువగా పప్పుతో కలిపి వండుతారు. మాంసాహార ప్రియులు మాత్రం మటన్, చేపలు, ఎక్కువగా పచ్చి రొయ్యలు, ఎండు రొయ్యలతో కలిపి వండుతారు.



తణుకులో చింతచిగురు విక్రయాలు

• చింత చిగురు పొడి, ఆవకాయ..



వేసవి కాలంలో మాత్రమే లభించే చింత చిగురును సంవత్సరం పాటు నిల్వ చేసుకునే ఆవకాయలా, పొడిగా చేసుకోవచ్చు. చింత చిగురు, మెంతులు, ఆవాలు, ఎండు మిర్చి, జీలకర్ర, మినపప్పు వేయించుకుని, పొడి చేసుకోవాలి. చింత చిగురును నూనెలో వేయించి మెత్తని పొడిగా చేసుకొని నిల్వ చేసుకోవచ్చు. దీనిని కొత్త ఆవకాయ పచ్చడితో కలిపి తింటే చాలా రుచిగా వుంటుంది. ఒక గ్లాసు చింత చిగురు, చిన్న గ్లాసు కారం, అరగ్లాసు ఆవపిండి, పావు గ్లాసు ఉప్పు, ఇంగువ నూనె పోసి నిల్వ చేసుకోవచ్చు. ఇది సంవత్సరం పాటు నిల్వ వుంటుంది.

-పెద్దాడ హరి, వంట మాస్టార్, తణుకు

• ఎన్నో ఔషధాలు ఉన్నాయి



చింత చిగురు ఎన్నో ఔషదాలు వున్న ప్రకృతి సిద్ధమైన వనరు. చింత చిగురు రక్తాన్ని శుద్ధిచేస్తుంది. శరీరంలో పేరుకుపోయిన విష పదార్థాలను తొలగించ డానికి సహాయం చేస్తుంది. జీర్ణశక్తిని మెరుగు పర్చడంలో ఇది చాలా ఉపయోగకరంగా పనిచేస్తుంది. అజీర్తి, కడుపునొప్పి వంటి సమస్య లకు ఇది సహజ చికిత్సగా పనిచేస్తుంది. ఇందులో వున్న ఇనుము రక్తహీనతకు నివారణకు దోహదం చేస్తుంది. కీళ్ల నొప్పులు, జ్వరం, దాహం వంటి సమస్యలకు ఇది ఉపశమనం కలిగిస్తుంది. చర్మ సంబంధిత సమ స్యలపై కూడా ఇది ప్రభావం చూపుతుంది. మధుమేహ నివారణకు, ఎముకల బలానికి సహకరిస్తుంది. దీనిని మితంగా ఉపయోగించడం మంచిది. ఏదైనా ఆరోగ్య సమస్య వుంటే వైద్యుల సూచన మేరకు తీసుకుంటే మంచిది.

- గోపాలకృష్ణ ప్రసాద్, పోషకాహార నిపుణుడు, తణుకు





కొండపై ఉన్న పిల్లల పార్కులో చిన్నారుల సందడి

శేషాచల కొండపై ఆటవిడుపు

- వేసవి సెలవుల్లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా...
- చిల్డ్రన్స్ పార్క్‌లో పిల్లల సందడే..సందడి

ద్వారకాతిరుమల, మే 26 (ఆంధ్రజ్యోతి): బడులకు వేసవి సెలవులు ముగుస్తున్నాయి... దీంతో తమ పిల్లలను దైవదర్శనాల నిమిత్తం ఆలయాలకు.. వినోద భరిత ప్రాంతాలకు తీసుకు వెళుతుంటారు. పిల్లలు కూడా ఎక్కడికైనా తీసుకెళ్లమని గోల చేస్తుంటారు. జిల్లాలో ప్రముఖ క్షేత్రమైన ద్వారకాతిరుమల ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మి కతతో పాటు కొండపై దేవస్థానం ఏర్పాటు చేసిన పార్కు పిల్లలకు ఆహ్లాదం కలిగిస్తున్నది. శేషాచలంపై ఉన్న శివాలయానికి వెళ్లే దారిలో దేవస్థానం సిబ్బంది క్వార్టర్ల వద్ద ఉన్న ఈ పార్క్ పిల్లలను ఆకర్షిస్తోంది. వేసవిసెలవుల నేపథ్యంలో చిన్నారులతో క్షేత్రానికి వస్తున్న భక్తులు ఈ పార్క్‌కు వెళ్లి సేదతీరుతున్నారు. ఈ పార్క్‌లో ఉయ్యాల స్టాండ్లు, జారుడుబల్ల, పలు రకాల ఆటవస్తువులను అందుబాటులో ఉంచారు. గుంటూరుకు చెందిన అక్కాచెల్లెళ్లు వెలగలేటి దుర్గాదేవి, వెలగలేటి సత్యవతిలు రూ.2 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఆట వస్తువులను అందించారు.

విరిగిన ఆటబొమ్మలు

దాతలు సమకూర్చిన ఆట వస్తువుల్లో కొన్ని విరిగి పోయినా తిరిగి వాటిని భర్తీ చేయడం లేదు. ఉన్న వాటితోనే కాలక్షేపం చేస్తోంది. పారిశుధ్య కార్మికులు చెత్తను శుభ్రం చేయడం లేదు. దీంతో చెత్తపేరుకుని పోయి కంపు కొడుతోందని భక్తులు అంటున్నారు. అధికారులు స్పందించి పిల్లల పార్కులో కొత్త ఆట వస్తువులను ఏర్పాటు చేయడంతో పాటు పరిసరాల పరిశుభ్రతను మెరుగుపర్చాలని స్థానికులు భక్తులు కోరుతున్నారు.

పార్కు రూపురేఖలు మార్చాలి



మా బంధువులు వస్తే పిల్లలతో కలసి దైవదర్శనం అనంతరం చిల్డ్రన్‌పార్కుకు వెళ్లాం. పార్కులో కొన్ని వస్తువులు విరిగిపోయి ఉన్నాయి. పార్కంతా అపరిశుభ్ర వాతావర ణంతో నిండి ఉంది. పిల్లలతో పార్కులకు వచ్చే వారికి ఆహ్లాదాన్ని ఇవ్వాలి.. పార్కు మరింత ఆహ్లాద భరితంగా మార్చాలి.

- పుసులూరి శ్రీధర్, ద్వారకాతిరుమల





పార్కు చెత్తబుట్టలో పేరుకున్న చెత్త



పాడైన ఆట పరికరం

తీరాన్ని తాకిన జోగి అక్రమాలు

30 ఎకరాల ప్రభుత్వ భూమి అమ్మేందుకు సిద్ధం

నరసాపురంలోనే అగ్రిమెంట్

నమ్మించి మోసం చేశాడు : లీలాప్రసాద్


మాజీ మంత్రి జోగి రమేష్

నరసాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి జోగి రమేష్ ఆయన అనుచరుల అవినీతి, అక్రమాలు తీర ప్రాంతానికి తాకాయి. నరసాపురం పట్టణానికి చెందిన ఆక్వా వ్యాపారి తమ్ము వీర వెంకట లీలాప్రసాద్ వీరి మాటలు నమ్మి మోసపోయిన వారిలో ఒకరు. 2021లో మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన అనుచరులు కృష్ణా జిల్లా పెడనలో 30 ఎకరాలు అమ్మకానికి ఉందని చెప్పడంతో నమ్మి రూ.90 లక్షలు అడ్వాన్స్ ఇచ్చారు. చివరికి అమ్మకానికి చూపించిన భూమి కూడా ప్రభుత్వ భూమి కావడంతో లీలాప్రసాద్ అడ్డం తిరగడంతో ఇప్పటివరకు ఒక్క రూపాయి తిరిగి ఇవ్వలేదు. తాజాగా లీలాప్రసాద్ కృష్ణా జిల్లాలో కేసు పెట్టడంతో మొత్తం ఈ బాగోతం బయటపడటం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడం విధితమే. దీనికి సంబంధించి సోమవారం లీలాప్రసాద్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మాజీ మంత్రి జోగి రమేష్ అనుచరులైన రత్నకుమారి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రాజులు మాటలు నమ్మి తాను మోసపోయానన్నారు. అయితే అడ్వాన్స్ చెల్లించే విషయంలోనూ, అగ్రిమెంట్ చేయించుకోవడంతో కేసు పెట్టగలిగానన్నారు. ఆధారాలు లేక చాలామంది వీళ్ల ఆగడాలపై కేసు పెట్టలేకపోతున్నారని ప్రసాద్ పేర్కొన్నారు.తాను మంత్రి ఖాతాకు రూ.30 లక్షలు జమ చేసి మిగిలిన మొత్తం నగదు రూపంలో మంత్రికి ఇచ్చానన్నారు. మంత్రి అనుచరులైన ముగ్గురిని పిలిపించుకుని ముందుగా నరసాపురంలో అగ్రిమెంట్ చేయించుకున్నానన్నారు. ఇదే తనకు కేసు పెట్టేందుకు ఆయుధంగా మారిందన్నారు. అమ్మకానికి పెట్టిన భూమి ప్రభుత్వానిదని, రిజిస్ట్రేషన్లు కావని అడ్డం తిరగడంతో సొమ్ము ఇస్తానని నమ్మించి మోసం చేశారన్నారు. రెండేళ్లుగా తిప్పించుకుని కాలయాపన చేశారే తప్ప ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. అందుకే కేసు పెట్టినట్లు లీలా ప్రసాద్ చెప్పారు.

బ్యాంకు రుణాలపై లోతైన విచారణ

బృందాన్ని నియమించిన బ్యాంకు ఉన్నతాధికారులు

నరసాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): తీరంలో సంచలనం రేకెత్తించిన సెంట్రల్ బ్యాంకు రుణాల స్కాం రోజుకో మలుపు తిరుగుతుంది. తాజాగా బాధిత రైతులు తిరుమాని నాగరాజు, శ్రీనివాస్‌లు తమ భూముల్ని లీజ్ అగ్రిమెంట్‌గా చూపించి రుణం పొందారంటూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కూడా దర్యాప్తు చేపట్టిన విషయం విధితమే. అయితే సంబంధిత రికార్డు అంతా బ్యాంకు విచారణ అధికారులు తీసుకెళ్ళడంతో పోలీసులకు ఇంతవరకు ఎటువంటి పత్రాలు అందలేదు. వీటి కోసం పోలీసులు ఎదురుచూస్తున్నారు. రాగానే అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. మరోవైపు రెండేళ్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మేనేజర్ ప్రకాశం ఇచ్చిన రుణాలన్నింటిపైనా బ్యాంకు అధికారులు లోతైన విచారణ చేపడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి అత్యధిక రుణాలు ఇచ్చినట్లు బ్యాంకు అధికారులు గుర్తించారు.వీటిపై కూడా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే విజయవాడ నుంచి వచ్చిన రెండు బృందాలు వేర్వేరుగా విచారణలు నిర్వహించాయి. నివేదికను ఆర్ఎంకు అందించారు. విచారణ అంతా గోప్యంగా సాగుతుంది. ఎటువంటి వివరాలను తెలియజేయడం లేదు. దీంతో రెండేళ్లుగా ఏఏ రుణాలు ఎంతమంది ఇచ్చారు.అందులో లీజ్ అగ్రిమెంట్లకు సంబంధించి ఎన్ని రుణాలు ఉన్నాయన్నది కూడా సస్పెన్స్‌గా మారింది.


ఫ్లెక్సీలను తొలగిస్తున్న పోలీసులు

ఎల్‌బీ చర్లలో ఫ్లెక్సీ వివాదం

ఆందోళన చేసిన దళిత సంఘాలు

నరసాపురం రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌బీచర్ల గ్రామంలోని బైనపాలెం సెంటర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు అంబేడ్కర్ ఫ్లెక్సీలను చింపేశారు. దీన్ని నిరసిస్తూ సోమవారం మురాల పేటకు చెందిన యూత్, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఫ్లెక్సీలను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివాదం పెద్దది కాకుండా రూరల్ సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై వెంకట సురేష్‌లు సంఘటన ప్రదేశానికి తరలివెళ్లారు. శాంతిభద్రతలు విఘాతం కలగకుండా ఆందోళనకారులతో చర్చించారు. తక్షణం నిందితులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో దళిత సంఘాలు ఆందోళనలు విరమించారు. మరోవైపు నో ఫ్లెక్సీ జోన్‌గా ప్రకటించి సెంటర్‌లో ఉన్న ఫ్లెక్సీలను పోలీసులు దగ్గరుండి తొలగించారు. ఇక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దంటూ గ్రామస్థులకు తెలియజేశారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు

ఏయూ ఫలితాల్లో 'ఆదిత్య' విద్యార్థులకు ర్యాంకులు

కాకినాడ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఆంధ్రా విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ ఫలితాల్లో వివిధ విభాగాల్లో 1, 2, 3 ర్యాంకులతో పాటు మొత్తం 12 ఉత్తమ ర్యాంకులు సాధించినట్టు కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి తెలిపారు. బీసీఏ విభాగం నుంచి దున్నా ధనలక్ష్మి 9.53 సీజీపీఏ పాయింట్లతో 1వ ర్యాంకు, అంజూర్ పావని 9.51 సీజీపీఏ పాయింట్లతో 2వ ర్యాంకు, బొడుపు శిరీష, గంగు రిపిక 9.50 సీజీపీఏ పాయింట్లతో 3వ ర్యాంకు సాధించారన్నారు. బీబీఏ విభాగంలో కొరిపోలు మహిత 2వ ర్యాంకు, వానపల్లి మౌనిక, జి.వెంకటసాయికీర్తి 3వ ర్యాంకు పొందారు. బీఎస్సీలో మండల యమున 1వ ర్యాంకు, సత్తి మోనికవిశాల్ 3వ ర్యాంకు, బీకాంలో హరిప్రియ 2వ, పి.పల్లవి 3వ ర్యాంకు సాధించారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు 15,120 క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సాధించారు. విద్యార్థులను ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి సుగుణారెడ్డి అభినందించారు.

నేర పరిశోధనలో పోలీసుశాఖ అత్యాధునిక వ్యవస్థలను రూపొందించుకుంటోంది.. టెక్నాలజీని వాడుకుని నేరస్థులను గుర్తిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కెమెరాలు, ఫేస్ రికగ్నైజింగ్ ఇంటెలిజెన్సీ వంటి అత్యాధునిక పరిజ్ఞానాన్ని పోలీస్ శాఖ ఉపయోగించుకుంటూ నేరస్తులను ఇట్టే పసిగడుతున్నది. ఇటీవల ఒక నేరస్తుడు జంగా రెడ్డిగూడెంలోని ఒక బ్యాంకులోకి ప్రవేశించారు. వెంటనే అతని కదలికల ఫోటో తీసి జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చేసింది. క్షణాల్లో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకోగా అతనిపై వేరే జిల్లాలో అరెస్టు వారెంట్లు పెండింగ్ ఉండడంతో అక్కడి పోలీసులకు అప్పగించేశారు.

నిఘా నేత్రాలు


ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఫేస్ రికగ్నైజేషన్ కెమెరా


ఏలూరు క్రైం (ఆంధ్రజ్యోతి)

1990కి ముందు..

1990వ సంవత్సరానికి ముందు వరకూ ఏదైనా దొంగతనం జరిగినా, నేరం జరిగినా అది ఎవరు చేశారో పోలీసులు తమ ఆలోచనా శక్తితో గుర్తించేవారు. ఒక జాతికి చెందిన దొంగలు కారులో వచ్చి ఇంట్లో మనుషులు ఉన్నా ఆ ఇంట్లో ప్రవేశించి వారందరినీ తాళ్ళతో కట్టేసి ఇంట్లో బంగారం, డబ్బులు తీసుకుని ఆ ఇంట్లో వంట చేసుకుని తిని వెళ్లిపోయేవారు. ఈ లక్షణాలు బట్టి ఈ నేరాన్ని పలానా ముఠా చేసిందని పోలీసులు గుర్తించేవారు. మరికొంత మంది నేరస్తులు ఇంటి గోడలను తవ్వి రంధ్రం పెట్టి ఇంట్లోకి ప్రవేశించేవారు. దారి కాసి తాము మఫ్టీ పోలీసులమనో లేదా మరే ఇతర డిపార్టుమెంటువారిమో అని బెదిరించి దోపిడీలు చేసేవారు. ఇదో రకమైన ముఠా. ప్రయాణీకుడులా వైట్ అండ్ వైట్ ఖరీదైన వస్త్రాలు ధరించి సూట్‌కేసు పట్టుకుని దూరం వెళ్ళే బస్సుల్లో ఆ సూట్‌కేసును పెట్టేసి మరో సూట్‌కేసును తీసుకుని కేటుగాళ్ళు ఉండేవారు. వీళ్ళను కూడా పోలీసులు తమదైన శైలిలో గుర్తించేవారు. మరికొంత మంది ప్రత్యేకించి దేవుడు గుళ్లనే దోచేవారు.నేరం జరిగిన పరిస్థితులను బట్టి పరిశీలించి పలానా ముఠా పని అని కనిపెట్టేవారు.

1990 తర్వాత..

ఇప్పుడు అత్యాధునిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. ఏ నేరం ఎవరు చేస్తున్నారో తెలియని పరిస్థితి. విద్యార్థులు, విద్యావంతులు సైతం జల్సాలకు అలవాటుపడి నేరాలకు పాల్పడుతున్నారు. చైన్ స్నాచింగ్‌లు, దారిదోపిడీలు పెరిగిపోయాయి.



ఫేస్ రికగ్నైజేషన్ కెమెరా నేరస్తుడిని గుర్తించి ఫొటోతో సహా కంట్రోల్ రూమ్‌కు పంపించిన చిత్రం

ఏలూరు మెయిన్ బైపాస్‌లో 2010 నుంచి 2015 వరకూ ఏకంగా 19 దారి దోపిడీలు జరిగాయి. కాని ఆనాడు ముఠాలను పట్టుకోవడంలో పోలీసులకే సవాల్‌గా మారింది. వెళ్ళేకార్లపై రాళ్ళు విసరడం. రాయి తగలగానే ఆ డ్రైవర్ కారు ఆపగా బైక్‌లపై వెంటాడి దాడి చేసి కత్తులతో బెదిరించి దోపిడీలు చేసేవారు. మొత్తం మీద ఒకేసారి ఈ నేరాలకు పాల్పడిన 22 మందిని ఏలూరు సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసి దారిదోపిడీలకు ఫుల్‌స్టాప్ పెట్టారు. అప్పటి నుంచి ఒకటి రెండు జరిగినా పోలీసులు నేరస్తులను అరెస్టు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో నేరస్తుల జాబితా

పోలీస్‌శాఖలో టెక్నాలజీ ప్రవేశపెట్టారు. 2010 నుంచి నమోదు అయిన ప్రతి కేసు.. అందులో అరెస్టు అయిన ప్రతి నిందితుడి వివరాలన్నీ ఆన్‌లైన్‌లో భద్రపరిచారు. దీంతో ఎవరైనా ఒక నేరం చేసి అరెస్టు అయి మరోసారి ఇంకో నేరం చేయగా అతని పేరు కంప్యూటర్‌లో నమోదు చేయగానే వెంటనే అతని నేరాల జాబితా వచ్చేస్తుంది. ఇక నేరస్తుల వేలిముద్రలు కూడా భద్రపర్చడంతో ఎక్కడ ఏ నేరం జరిగినా వేలిముద్రల ద్వారా పోలీసులు నేరస్తులను గుర్తించి వందలాది కేసుల్లో అరెస్టులు చేశారు. ఎంతో సొత్తును రికవరీ చేశారు. ఇప్పుడు టెక్నాలజీ మరింత పెరిగింది. ముఖ్యమైన రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో, ఆసుపత్రులలో, ప్రధాన కూడళ్ళల్లో, బ్యాంకుల వద్ద, ముఖ్యమైన కార్యాల యాల వద్ద జిల్లా మొత్తంమీద 860కి పైగా కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల్లో రెండు సంవత్సరాలు పైబడి బ్యాకప్ ఉంటుంది. దీంతో ఏదైనా నేరం జరిగినప్పుడు పోలీసులు ఆయా ప్రాంతాల్లో పరిశీలన జరుపుతున్నారు.


ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో

ఫేస్ రికగ్నైజేషన్‌తో నేరస్థులపై నిఘా

ఇప్పుడు మరో నూతన టెక్నాలజీ పోలీస్‌శాఖకు అందుబాటులోకి వచ్చేసింది. ఫేస్ రికగ్నైజేషన్ యాప్ అను సంధానంలో ఉండే కెమెరాల ద్వారా

నేరస్తులను కనిపెట్టేందుకు ఫేస్ రికగ్నైజేషన్ కెమెరాలు

కెమెరాకి కనిపించగానే పోలీసులకు సమాచారం

నూతన టెక్నాలజీతో సత్ఫలితాలు

నేరస్తుల కదలికలపై నిఘా పెంచారు. ఇప్పటి వరకూ పోలీసులు మఫ్టీల్లో రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ప్రధాన కూడళ్ళల్లో డ్యూటీలు నిర్వహించేవారు. కానీ ఆ డ్యూటీలో ఉన్న పోలీసులకు అందరు నేరస్తులను గుర్తుపట్టే వీలు ఉండేది కాదు. దీంతో నేరస్తులు స్వేచ్ఛగా నేరాలు చేసి రైళ్ళల్లో, బస్సుల్లో హాయిగా వెళ్ళిపోయేవారు. ఇప్పుడు నూతన కెమెరాలను జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ప్రధానంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో, ఆసుపత్రులలో, ప్రధాన కూడళ్ళల్లో, బ్యాంకుల వద్ద ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా ఏ కేసులో అయినా కేసు నమోదై అతని ఫొటో, వేలిముద్ర ఆ స్టేషన్‌లో ఒక్కసారి తీసుకుని ఆన్‌లైన్ చేస్తే అతను జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఏ కెమెరా ముందు కనిపిస్తే గుర్తించి అతని కదలికలను జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అందిస్తుంది. అతని ఫొటో కూడా క్షణాల్లో తీసి పంపిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఏ పోలీస్ స్టేషన్‌లో నమోదైన నేరస్తులే కాదు మన జిల్లాలో కేసుల్లో ఉండి పోలీస్ స్టేషన్‌లో ఫోటోలు, వేలి ముద్రలు తీసుకొనబడిన నేరస్తులు, దోపిడీలు, దొంగతనాలు, హత్యలు, తదితర నేరాలకు సంబం ధించిన వారు జిల్లాలో ఏ మూల ఎటు తిరిగినా వారి సమాచారాన్ని ఈ కెమెరాలు పసిగట్టి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ కోర్) విభాగానికి పంపిస్తుంది. ఈ విధంగా మొత్తం మీద జిల్లాలోని రౌడీలు, దొంగల కదలికలు కొద్ది రోజుల నుంచి పోలీసులు ప్రత్యేకంగా ఆ కెమెరాల ద్వారా పసిగడుతున్నారు. వారు ఎక్కడెక్కడికి వెళ్తున్నారు? ఎప్పుడెప్పుడు వస్తున్నారు వంటివి రికార్డుల ద్వారా క్షుణ్ణంగా పరిశీలన చేస్తున్నారు. నేరస్తులు, రౌడీ షీటర్లు రాత్రి వేళ బయటకు రాకూడదు. కానీ వీరి కదలికలు ఏమాత్రం కనిపించినా అధికారులు కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో విశ్లేషణ జరుపుతున్నారు. ఇప్పటికే జిల్లాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రోబోటిక్ ద్వారా జిల్లా పోలీస్ కార్యాలయం ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదు తీసుకునే విధానం పైలెట్ ప్రాజెక్టు ద్వారా కొనసాగిస్తున్నారు. జిల్లా మొత్తం కెమెరాలు ఏర్పాటు చేసి ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్ ద్వారా పోలీసు నిఘా గట్టిగా పెంచారు. నగరంలో నైట్ బీటు పోలీసులు కనపడడం లేదు. నూతన టెక్నాలజీతో ప్రతి చోట ఉన్న ఈ కెమెరాలే నిఘా పోలీసులుగా పోలీస్‌శాఖకు సహాయపడుతున్నాయి. నేరస్తులు ఎటువైపు వెళ్ళినా ఇవి వెంటనే సమాచారాన్ని అందిస్తాయి.


ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీలో ఫిర్యాదును వీడియో రికార్డింగ్ చేస్తున్న పోలీస్ సిబ్బంది

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా ఫిర్యాదుల స్వీకరణ

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో పోలీస్‌శాఖ నూతన వరవడికి శ్రీకారం చుట్టింది. ఏలూరు జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా పోలీస్‌శాఖ చేపట్టి ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజల నుంచి స్వీకరించే ఫిర్యాదులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ద్వారా స్వీకరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం ఏలూరు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 39 ఫిర్యాదులను ఎఐ విధానంలో బోట్‌కు విన్నవించారు. ప్రతి ఫిర్యాదుదారుడు కెమెరా ముందు తమ సమస్యలను తెలియజేయగా వీడియో రికార్డింగ్ చేసి ఏఐతో సంభాషిస్తారు. ఏమైనా ఆ ఫిర్యాదుల్లో అనుమానాలు ఉంటే అప్పటికప్పుడే ఏఐ ప్రశ్నలను అడుగుతుంది. దీనివల్ల ఫిర్యాదుదారుడు సమగ్రంగా స్పష్టంగా ఫిర్యాదు చేయవచ్చు. ఆటోమేటిక్‌గా ఆ ఫిర్యాదు జనరేట్ అయి సంబంధిత పోలీస్ స్టేషన్‌కు వెళ్ళిపోతుంది.నిబంధనల ప్రకారం దానిపై ఏం చర్యలు తీసుకున్నారో తిరిగి సమాధానాన్ని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు గడువు సమయంలోపు పంపించాల్సి ఉంది. ప్రతి ఫిర్యాదు కూడా వీడియో రికార్డింగ్ ద్వారా నమోదు చేస్తున్నారు. భవిష్యత్తులో ఏదైనా సందేహాలు, విబేధాలు తలెత్తితే ఖచ్చితంగా ఇదంతా ఉపయోగపడుతుంది. ఒక సమస్యపై గతంలో ఎప్పుడైనా ఫిర్యాదు చేసినా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గుర్తించి ఆడేటా మొత్తం క్షణాల్లోనే అందిస్తుంది. దీంతో అధికారులు పునఃపరిశీలన చేయడానికి ఎంతో దోహదపడనున్నాయి.

ర్యాంకుల ప్రాతిపదికన హెల్త్ అసిస్టెంట్లకు పని సర్దుబాటు కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా 48 మండలాల పరిధిలో పనిచేస్తున్న ఎంపీహెచ్ఏ (మేల్) ఉద్యోగులను మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో ఎన్‌వీబీడీసీడీ (జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ) కార్యక్రమంలో తాత్కాలిక ప్రాతిపదికన వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై నియ మించేందుకు ఉమ్మడి జిల్లాలోని 252 మందితో కూడిన ప్రొవిజనల్ సీనియార్టీ జాబితాను ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసింది. జాబితాల్లోని వివరాలపై అభ్యంతరాలను సోమవారం మధ్యాహ్నం 12 గంట ల్లోగా తెలియజేయాలని సూచించగా మొత్తం 100కు పైగా అర్జీలు అందాయి. వీటిని పరిష్కరించిన తర్వాత తుది సీనియార్టీ జాబి తాను విడుదల చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగుల ర్యాంకు, సీనియార్టీ ప్రాతిపదికన ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా రాగల రెండు రోజుల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, తేదీని ఇంకా ఖరారు చేయ లేదని ఏలూరు జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో డాక్టర్ గంగాభవాని తెలిపారు. ఉమ్మడి జిల్లాపరిధిలోని పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల డీఎంహెచ్‌వోలు, డీఎంవోలను కూడా పిలిచి కౌన్సెలింగ్ ప్రక్రియద్వారా ఎంపీహెచ్ఏ (మేల్) ఉద్యోగులను ఇపుడు పనిచేస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే నియామకాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఆమె వివరించారు.

నేడు ఉమ్మడి జిల్లా హెచ్‌ఎం పదోన్నతులకు ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్

ఏలూరు అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గ్రేడ్-2 హెచ్‌ఎం పదోన్నతులకు అర్హతలు గల స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల వివరాలను డీఈవో ఏలూరు.ఓఆర్‌జి వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు ఉమ్మడిజిల్లా డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. మొత్తం 106 పోస్టుల భర్తీకి 1:3 నిష్పత్తిన 318 మంది అర్హులైన స్కూల్ అసిస్టెంట్లను గుర్తించామని, వీరందరూ తమ సర్వీస్ రిజిస్టర్, విద్యార్హతల ధ్రువీకరణపత్రాలతో ఏలూరు సత్రంపాడులోని సిద్ధార్థ స్కూలుకు ఈనెల 27న తప్పని సరిగా హాజరుకావాలని ఆదేశించారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఏలూరు జిల్లాలోని 19 మండలాల ఉపాధ్యా యులు, మధ్యాహ్నం ఒంటి గంటనుంచి సాయంత్రం వరకు పశ్చిమ గోదావరి జిల్లాలోని 20 మండలాలు, తూర్పు గోదావరి జిల్లాలోని 9 మండలాల ఉపాధ్యా యులు హాజరుకావాలని సూచించారు. ఎవరైనా పదో తరగతి పరీక్షల విధుల్లో ఉంటే మధ్యాహ్నం హాజరయ్యేందుకు వీలు కల్పించామన్నారు.

ముగిసిన పవర్ లిఫ్టింగ్ పోటీలు

అమలాపురం టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్-2025 పోటీలు సోమవారంతో ముగిశాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సర్‌సీవీ రామన్ స్కూలు ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో పలు విభాగాల్లో గెలుపొందిన 24 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక చేసినట్టు అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్, స్పోర్ట్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయిలో కాకినాడకు చెందిన ఎం.జగన్ స్ట్రాంగ్‌మెన్ విన్నర్‌గా నిలిచారు. స్ట్రాంగ్‌మెన్ రన్నర్‌గా కె.శివకుమార్ (కాకినాడ)లు నిలిచి షీల్డులు అందుకున్నారు. స్ట్రాంగ్ ఉమెన్ విన్నర్‌గా అమలాపురానికి చెందిన అంతర్జాతీయ క్రీడాకారిణి పి.వందన,రన్నర్‌గా రామచంద్రపురానికి చెందిన బి.అఖిల నిలిచింది. స్ట్రాంగ్ మాస్టర్ విన్నర్‌గా డి.నాగేశ్వరరావు (ద్రాక్షారామ), రన్నర్‌గా బి.అప్పన్న (అమలాపురం)లు షీల్డులు అందుకున్నారు. పవర్ లిఫ్టింగ్ పోటీల టీమ్ చాంపియన్ షిప్‌ను కాకినాడ దక్కించుకోగా రన్నర్‌గా అమలాపురం జట్టు నిలిచింది. వివిధ విభాగాల్లో గెలుపొందిన 24 మంది క్రీడాకారులను జూన్‌లో ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక చేశారు. ఆయా పోటీల విజేతలకు నిర్వాహకులు కృష్ణపద్మరాజు, ఆశెట్టి ఆదిబాబు, సూదా గణపతి, వేణుగోపాల్, దొమ్మేటి వెంకటరమణ, చిక్కం రాజబాబు, డాక్టర్ కొప్పుల నాగమానస పతకాలు అందించారు.

రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం

తాడేపల్లిగూడెం రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో ఆదివారం రాత్రి పట్టణ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించి చోరీకి గురైన రెండు మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ ఆదిప్రసాద్ తెలిపారు. పట్టణంలో తనిఖీలు నిర్వహిస్తుండగా మెట్ట ఉప్పరగూడేనికి చెందిన దుర్గాప్రసాద్ నుంచి శేషమహల్ రోడ్డులోచోరీకి గురైన రెండు మోటారు సైకిల్స్ స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని పట్టుకుని వారిపై కేసులు నమోదు చేసినట్టు వివరించారు. ఎస్సైలు బాదం శ్రీనివాస్, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

6 కాసుల బంగారం చోరీ

ఏలూరు క్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి తాళం వేసి ఆ తాళాన్ని ఇంటి బయట దాచిపెట్టి బయటకు వెళ్ళి వచ్చేటప్పటికి దొంగలు ఆ తాళం చెవిద్వారా ఇంటి తాళం తీసి ఇంట్లోని ఆరు కాసుల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఏలూరు రూరల్ మండలం మొండికోడు గ్రామానికి చెందిన గజ్జల దుర్గారావు ఈనెల 24వ తేదీ ఉదయం తన ఇంటికి తాళం వేసి ఆ తాళం చెవిని రహస్యంగా దాచిపెట్టాడు. తిరిగి సాయంత్రం వచ్చేసరికి తలుపులు తీసి ఉన్నాయి. లోపలకు వెళ్ళి చూడగా ఇంట్లోని ఆరు కాసుల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. సోమవారం ఏలూరు రూరల్ పోలీసులకు దుర్గారావు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేశారు.

సోడా బండి వ్యాపారిపై కత్తితో దాడి

భీమవరం క్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి) : సోడా బండి నడుపుకుంటున్న ఒక వ్యక్తిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువకుడు కత్తితో బెదిరించి నగదు లాక్కెళ్ళిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ ఎస్ఐ కృష్ణాజీ తెలిపారు. చినరంగనిపాలెం సెంటర్‌లోని కళ్యాణ మండపం వద్ద కామన వీర వెంకట సత్యనారాయణ సోడా బండి నడుపుతున్నాడు. ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక యువకుడు వెళ్ళి నిమ్మ సోడా కావాలని అడిగాడు. డబ్బులు ఇవ్వమని అడగగా జేబులో నుంచి చాకు తీసి సత్యనారాయణ మెడపై పెట్టి బెదిరించి తీవ్రంగా దాడి చేసి జేబులో ఉన్న రూ. 2వేలు లాక్కుని పరారయ్యాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


విలేకర్లతో మాట్లాడుతున్న అధ్యాపకురాలు గంగాలక్ష్మి

కళాశాల కరస్పాండెంట్ లైంగిక వేధింపులు

బీజీబీఎస్ కాలేజీ అధ్యాపకురాలి ఆరోపణ

నరసాపురం టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): బీజీబీఎస్ మహిళా కళాశాల కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్‌పై కాలేజీలో తాత్కాలిక అధ్యాపకురాలుగా పనిచేస్తున్న గంగాలక్ష్మి సోమవారం తీవ్ర ఆరోపణలు చేశారు. కొన్ని రోజుల నుంచి కరస్పాండెంట్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారంటూ విలేకర్ల సమావేశంలో ఆమె ఆరోపించారు. లాడ్జీకి, సినిమాకి, సెలవు రోజుల్లో కాలేజీకి రమ్మని ఒత్తిడి చేసేవారన్నారు. దివ్యాంగురాలైన తనను విడిచిపెట్టాలని ఎన్నిసార్లు చెప్పినా అతని బుద్ధి మారలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అతని కోరిక తీర్చలేదన్న కోపంతో రెండుసార్లు ఉద్యోగం ఉంచి తొలగించారన్నారు.చివరికి తోటి ఉద్యోగులు, విద్యార్థుల ఆందోళన చేయడంతో తిరిగి విధుల్లో చేర్చుకున్నా వేదింపులు మాత్రం తగ్గలేదన్నారు. కాలేజీలో జరుగుతున్న అరాచకాలపై అధికారులు విచారించి శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

అవన్నీ అవాస్తవాలు

కరస్పాండెంట్ శ్రీనివాస్ ఈ ఆరోపణలను ఖండించారు. దివ్యాంగురాలైన గంగాలక్ష్మిని తమ కుటుం బంలో ఒక సభ్యురాలుగా భావించి సాయం చేశానే తప్ప ఆమెను ఎప్పుడూ వేదించలేదన్నారు.బయట వ్యక్తులతో కలిసి కొంతమంది సిబ్బంది కాలేజీ చరిత్రను చెడగొట్టేందుకు ఇటువంటి కుట్ర పన్నుతున్నారని అన్నారు. 12 ఏళ్ల నుంచి లైగింక వేదింపులకు పాల్పడుతుంటే స్టాఫ్ సమావేశంలో యాజమాన్యానికి ఎందుకు ఫిర్యాదు చేయలేదని ఆయన ప్రశ్నించారు. వైస్ ప్రిన్సిపాల్ మధుషాలిని ప్రోత్సాహంతో తనపై ఇటువంటి తప్పుడు ఆరోపణలు చేసి ఉండవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు.

రిటైర్డు జవాన్లకు ద్రోహం

ఎఫ్‌సీఐ గోడౌన్లలో సిబ్బందికి వేధింపులు

నెలనెలా మామూళ్లు ఇవ్వాలని బెదిరింపులు

డిపో మేనేజర్‌కు సూపర్‌వైజర్, గార్డులు ఫిర్యాదు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి):సరిహద్దులో సిందూర్ ఆపరేషన్‌లో పాల్గొన్న ఆర్మీకి జనం అంతా ఐక్యంగా అందరూ సెల్యూట్ చేశారు. అందరూ జై జవాన్ అంటూ జైకొట్టారు. ఆర్మీలో రిటైరైన తర్వాత తమ కుటుంబాలకు పోషించుకునేందుకు జవాన్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తుంటారు. ఉమ్మడి జిల్లా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) గోడౌన్లలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులపై వేదింపుల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారికొచ్చే రూ.20 వేల వేతనంలో రూ.2 వేల వరకు మామూళ్లను సమర్పించాలని సంస్థలోని ఒక ఉద్యోగి మధ్యవర్తిత్వం వహించడంపై ఆవేదన చెందుతున్నారు. మహరాష్ట్ర ఎక్స్ సర్వీస్‌మెన్ కో-ఆపరేటివ్ లిమిటెడ్ (మెస్కో) నిర్వహణలో 2023 మార్చి నెల నుంచి ఏప్రిల్ 2025 వరకు ఏలూరు, నిడదవోలు, పాలకొల్లు, భీమవరం, తాడే పల్లిగూడెలోని ఎఫ్‌సీఐ డిపోల్లో గోడౌన్లు ఐదుగురు సూపర్‌వైజర్లు, 83 మంది గార్డులు పనిచేస్తున్నారు.ఇటీవల వీరి కాంట్రాక్టు గడువు ముగిసింది. తాజాగా మెస్కో నుంచి ముప్పనేని తిరుపతిస్వామి సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహణ బాధ్యతలను తీసుకుంది. పాత ఏజెన్సీ కింద పనిచేస్తున్న వారిని కొనసాగించడానికి అంగీకారం కుదిరింది. ఇందులో భాగంగా నిర్వాహకుల్లో ఒకరి డిమాండ్లకు తలొగ్గి పాత సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, గార్డులను తొలగించడానికి పూనుకోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ప్రతీనెల సూపర్ వైజర్లు 2 వేలు,గార్డులకు 1500 మామూళ్లు ఇవ్వాలని లేకుంటే అంతర్గతంగా బదిలీలు చేస్తామంటూ హెచ్చరికలు పంపుతున్నారు. దీంతో సూపర్ వైజర్లు, గార్డులు ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్‌ను కలిసి తమ సమస్యను సోమవారం విన్నవించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఎఫ్‌సీఐ ఉన్నతాధికారులు ఏ నిర్ణయం తీసుకుంటారో అన్నది ఆసక్తికరంగా మారింది. జవాన్లు సరిహద్దులో ఎంతో విలువైన సేవలను చేసి తమ కుటుంబాలను గౌరవప్రదంగా పోషించు కోవడానికి రిటైరైన తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వ సంస్థలో పనిచేస్తుంటే ఈ రకమైన వేధింపులా అన్న విమర్శ రేగుతోంది.

ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు మంత్రి కొలుసు అభినందన

ఏలూరు, మే 26(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన ఆలపాటి సురేష్‌ను మంత్రి కొలుసు పార్థసారథి అభినందించారు. ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా సురేశ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సురేశ్ నాయకత్వంలో జర్నలిస్టులకు ఎంతగానో మేలు జరుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నలిజంలో కొనసాగుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి ప్రభుత్వం ద్వారా పరిష్కారమయ్యేలా చూడాలని మంత్రి కోరారు.

సబ్సిడీపై విత్తనాలు అందజేయండి

ఏలూరు రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ పంటకు 75 శాతం సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సోమవారం కలెక్టర్ వెట్రీ సెల్వికి వినతిపత్రం అందజేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు మాట్లాడుతూ విత్తనాల కొరత లేకుండా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రైతు సంఘం జిల్లా నాయకులు కూచిపూడి నాగేశ్వరరావు, చలసాని జగన్మోహనరావు, బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ఉన్నారు.

హామీల అమలు కోసం 2న ధర్నాలు

ఏలూరు కార్పొరేషన్, మే 26(ఆంధ్రజ్యోతి) : సీపీఐ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరుతూ జూన్ 2వ తేదీన జిల్లా అంతటా ధర్నాలు నిర్వహిస్తున్నట్టు సీపీఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు, మన్నవ కృష్ణచైతన్య, రెడ్డి శ్రీనివాస డాంగేలు తెలిపారు. సీపీఐ కార్యాలయంలో సోమవారం ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. తల్లికి వందనం, నిరుద్యోగభృతి, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతోపాటు నెలకు 1500 రూపాయలు ఇస్తామన్న వాగ్దానాలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భజంత్రి శ్రీనివాసరావు, ఎం.క్రాంతి, బేతా శంకర్, మూర్తి కోరారు.

సర్పంచ్‌లపై వేధింపులు ఆపాలంటూ వినతి

ఏలూరు రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి) :వైసీపీ సానుభూతిపరులైన సర్పంచ్‌లపై అధికార పార్టీ నేతల అండదండలతో జిల్లా పంచాయతీ అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని, పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ కుమార్, కామిరెడ్డి నాని, సి.హెచ్.సుబ్బారావు, ఎస్.విష్ణు, ప్రభుదేవ మాట్లాడుతూ శ్రీరామవరం పంచాయతీలో టీడీపీ వార్డు మెంబర్ల చేత తప్పుడు ఫిర్యాదు చేయించారని, వాటిపై డీపీవో ఆధ్వర్యంలో 8 నెలల పాటు విచారణ చేయించారని తెలిపారు. ఈ విచారణ నేపథ్యంలో శ్రీరామవరం సర్పంచ్ కామిరెడ్డి నాని చెక్ పవర్ రద్దు చేస్తున్నామని, అభ్యంతరాలుంటే కలెక్టర్‌కు వారం రోజుల్లో అప్పీల్ చేసుకోవాలంటూ నోటీస్ జారీ చేశారని చెప్పారు. ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాలేదని చెబుతూనే మరోవైపు వేధింపులకు పాల్పడటం దారుణమన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లకు కనీసం గౌరవం లేదని అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని ఆరోపించారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు.

భీమడోలులో నేడు జాబ్ మేళా

భీమడోలు, మే 26(ఆంధ్రజ్యోతి) :ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ(సీడాప్), జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జితేంద్ర తెలిపారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సహకారంతో గీతాంజలి డిగ్రీ జూనియర్ కళాశాలలో ఈ మేళా జరుగుతుందని, 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని సుమారు 748 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. జాబ్ మేళాకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, ఫార్మసీ, ఎంబీఏ, పీజీ, బీటెక్, 18 నుంచి 40 సంవత్సరాల లోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తమ బయోడేటా, సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలి

కామవరపుకోట, మే 26(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు. తడికలపూడిలో సోమవారం కెఆర్ఆర్ బ్రైట్‌మైండ్స్ పాఠశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కేఆర్ఆర్ స్కూల్ చైర్మన్ కొప్రపాటి సుధాకర్, పాఠశాల సిబ్బంది ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సరస్వతిదేవి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, విద్యతోపాటు సామాజిక అవగాహన పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, రైతు సంఘ జిల్లా నాయకులు మద్దిపోటి నాగేశ్వరరాంబాబు, తూతా లక్ష్మణరావు, కంఠమనేని అంజిమూర్తి, కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

పరిశ్రమల స్థాపనకు విశేష కృషి : ఎమ్మెల్యే ధర్మరాజు



స్థలానికి సంబంధించి పత్రాలు పరిశీలిస్తున్న దృశ్యం

భీమడోలు, మే 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. అంబర్‌పేట గ్రామంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ ఏర్పాటులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు స్థల సేకరణ కోసం అంబర్‌పేట గ్రామంలో ఎమ్మెల్యే ధర్మరాజు పర్యటించారు. ఈ సందర్భంగా భీమడోలు తహసీల్దార్ రమాదేవి, రెవెన్యూ, స్థానిక నేతలతో కలిసి స్థలాలను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంఎస్, ఎంఈ పరిశ్రమలను స్థాపించేందుకు 50 ఎకరాల విస్తీర్ణం కల్గిన స్థలాన్ని సేకరిస్తున్నట్టు తెలిపారు. త్వరలో పరిశ్రమ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నామన్నారు.

రెండు ఆలయాలకు చైర్మన్ల ఎంపిక



టి.నర్సాపురం, మే 26(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీఅన్నపూర్ణ విశాలక్షి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్‌గా అలుమోలు వెంకట శ్రీనివాసరావు, బొర్రంపాలెం శ్రీకోదండ రామస్వామి ఆలయానికి నాలి చక్రవర్తులను చైర్మన్‌లుగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఎంపిక చేశారు. ఎంపిక పత్రాలను బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పిస్తుందని, ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామ్మూర్తి, మండల నాయకులు అడపా నాగరాజు, నాయుడు రామకృష్ణారావు గౌడ్, విశ్వనాథ్, బొంతు సత్యనారాయణ, పెద్దిన సత్యనారాయణ, పిన్నమనేని మధు, నవీన్, పెద్దిన సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించొద్దు

ఏలూరు రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, తొలగించి 2500 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని కలిసి కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ఇచ్చిన పిలుపులో భాగంగా ఎఫ్‌టియు, ఏఐటియుసీ, సీఐటీయు నాయకులు, కార్యకర్తలు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఆర్ లింగరాజు, ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకట్రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించే ప్రయత్నం చేస్తుంటే ఏమి పట్టనట్టు రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడాన్ని తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణ అధ్యక్షుడు కిశోర్‌కు అభినందనలు



జంగారెడ్డిగూడెం, మే 26 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన కొండ్రెడ్డి కిశోర్‌ను సోమవారం పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అనుబంధ సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొండ్రెడ్డి కిశోర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు పట్టణ అధ్యక్షుడి బాధ్యతలు అప్పగించిన ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అభినందనలు తెలిపిన వారిలో టీడీపీ నాయకులు పరిమి సత్తిపండు, రాష్ట్ర క్షత్రియ, శెట్టిబలిజ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు నంబూరి రామచంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, పెనుమర్తి రామకుమార్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, మహంకాళి రామ్మోహనరావు, కౌన్సిలర్లు తెలగారపు జ్యోతి, కరుటూరి రమాదేవి, కంపా రాజేంద్ర, పాతూరి అంబేడ్కర్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

లింగపాలెం, మే 25(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తమ ఇళ్లతో పాటుగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ధర్మాజీగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక అన్నారు. మండలంలో కలరాయునిగూడెంలో సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరికైనా డెంగీ, మలేరియా వ్యాధుల లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

మొండికేస్తున్న ఆర్టీసీ బస్సులు



సాంకేతిక లోపంతో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

- సరైన కండీషన్ లేక సాంకేతిక సమస్యలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- జంగారెడ్డిగూడెం - పోలవరం మధ్య సమస్య

పోలవరం, మే 26(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం, రాజమహేంద్రవరం, నిడదవోలు పట్టణాల ఆర్టీసీ డిపోల నుంచి పోలవరం రాకపోకలు సాగించే బస్సులు మార్గమధ్యలో మొరాయిస్తున్నాయి. తరచూ సాంకేతిక కారణాలతో నిలిచిపోవడం ప్రయాణాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పోలవరం నుంచి జంగారెడ్డి గూడెం, రాజమహేంద్రవరం, నిడదవోలు పట్టణాలకు వైద్యం కోసం, ఆర్డీవో కార్యాలయానికి, కోటరామచంద్రాపురం ఐటీడీఏ కార్యాలయానికి, ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలకు విధుల నిమిత్తం వెళ్లే ఉద్యోగులు, విద్యా సంస్థలకు వెళ్లే ఉపాధ్యాయులు, విద్యార్థులు, వ్యాపారాల నిమిత్తం వెళ్లే వ్యాపారులు, ప్రయాణికులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. తమ ప్రయాణాలు మధ్యలో నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి ప్రస్తుతం పోలవరం సర్వీసులు నడుపుతున్న బస్సుల స్థానంలో కొత్త బస్సులు, కండీషన్‌లో ఉన్న బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సోమవారం ఆగిన మరో బస్సు..

జంగారెడ్డిగూడెం నుంచి పోలవరం మధ్య నడిచే ఆర్టీసీ బస్సు సోమవారం ఎల్.ఎం.డి.పేట శివారున సాంకేతిక సమస్యలతో నిలిచిపోయింది. దీంతో జంగారెడ్డిగూడెం నుంచి పోలవరం వచ్చే ప్రయాణికులు సుమారు 24 కిలోమీటర్ల మేర ప్రైవేటు వాహనాల్లో చేరాల్సి వచ్చింది. ఈ నెల 15న ఇదే డిపోకి చెందిన బస్సు ఇదే గ్రామంలోని కొవ్వాడ కాలువ వంతెన సమీపంలో సాంకేతిక సమస్యతో నిలిచిపోయింది. ఈ రూటులో ఆర్టీసీ బస్సులు నిలిచిపోవడం ఈ నెలలో ఇది రెండోసారి అధికారులు స్పందించి కండిషన్‌లో ఉన్న బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఏలూరు నుంచి తరలివెళ్తున్న నాయకులు



జంగారెడ్డిగూడెం నుంచి మహానాడుకు తరలివెళ్తున్న నాయకులు

కడప మహానాడుకు తరలివెళ్లిన నాయకులు

ఏలూరు టూటౌన్ / దెందులూరు/ జంగారెడ్డిగూడెం, మే 26(ఆంధ్రజ్యోతి) : కడపలో 27 నుంచి 29 వరకు నిర్వహించ తలపెట్టిన టీడీపీ రాష్ట్ర మహానాడుకు చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌తో కలిసి జంగారెడ్డిగూడెంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి టీడీపీ నేతలు సోమవారం బయల్దేరి వెళ్లారు. మహా నాడుకు వెళ్లిన వారిలో టీడీపీ నాయకులు పరిమి సత్తిపండు, టీడీపీ మండలాధ్యక్షుడు సాయిల సత్య నారాయణ, పెనుమర్తి రామకుమార్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, మహంకాళి రామ్మోహనరావు, గుమ్మడి ప్రసాద్, చిట్రోజు తాతాజీ, పరిమి ధర్మరాజు ఉన్నారు. దెందులూరు మండలం నుంచి పెద్దఎత్తున నాయకులు బయల్దేరి వెళ్లారు. దెందులూరు మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్(మిల్లుబాబు), తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మోతుకూరి నానిబాబు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల నుంచి టీడీపీ నాయకులు కార్లు, వ్యాన్లపై టీడీపీ జెండాలతో తరలి వెళ్లారు. టీడీపీ మండల కార్యదర్శి నాగనబోయిన సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్లు పుసులూరి ప్రసాద్, బాలిన కుమారి, మద్దా దయానంద రాజు, పార్టీ నాయకులు యలమర్తి శ్రీనువాస రావు, నున్న లక్ష్మణ్, బోడేటి మోహన్ బాబు, గారపాటి కొండయ్య చౌదరి, ఇప్పిలి వెంకటేశ్వరరావు, ముమ్మడి మోహన్ రావు పూజారి శ్రీనివాసరావుతో పాటు టీడీపీ నాయకులు, అధ్యక్షులు పెద్ద ఎత్తున మహానాడుకు తరలివెళ్లారు. కడపలో జరిగే మహా నాడుకు ఏలూరు మాజీ మున్సిపల్ చైర్మన్ ఉప్పాల జగదీష్ బాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, టీడీపీ నాయకులు జీకేవీ ప్రసాద్ తరలివెళ్లారు.

జూనియర్ కళాశాలను కొనసాగించాలి

కామవరపుకోట, మే 26(ఆంధ్రజ్యోతి) :ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు స్థానిక శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాల వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు.తామంతా పేదలమని, తమ పిల్లలు ఇంటర్‌లో కళాశాలలో చేర్చేందుకు పాఠశాలకు వస్తే ప్రవేశాలు తీసుకోవడంలేదని తెలిపారు. వెంటనే ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరానికి అడ్మిషన్లు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు పాల్గొన్నారు.



ఐక్య నినాదం చేస్తున్న రైతు సంఘ నాయకులు

కోకో గింజలు కొనుగోలు చేయాలి

ఏలూరు కార్పొరేషన్, మే 26(ఆంధ్రజ్యోతి) : కోకో రైతుల నుంచి గింజలను కిలో 500 రూపాయల చొప్పున కొనుగోలు చేసి న్యాయం చేయాలని రైతు సంఘ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం ఏలూరు అన్నేభవనంలో కోకో రైతుల సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు గొల్లు రామకృష్ణ, కె.శ్రీనివాస్‌లు మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు కోకో గింజలు మద్దతు ధరకే కొనుగోలు చేయాలన్నారు. ట్రేడర్లు 450 చొప్పున కొనుగోలు చేస్తే ప్రభుత్వం 50 రూపాయలు చొప్పున రైతులకు అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఆ హామీని అమలు చేయాలని కోరారు.



జేసీకి ఫిర్యాదు చేస్తున్న వృద్ధురాలు రాముడు

కొడుకులు వేధిస్తున్నారని ఫిర్యాదు

ఏలూరు రూరల్ మే 26(ఆంధ్రజ్యోతి) : కొడుకులు తాను ఉంటున్న ఇంటి కోసం వేధిస్తున్నారంటూ సోమవారం ఏలూరు ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఫిర్యాదు చేసింది. గత 25 ఏళ్లగా తనను ఒంటరిగా వదిలేసి వెళ్ళిన కొడుకులు కోడళ్లు ఇటీవల వచ్చి తాను ఉంటున్న ఇంటికి తాళాలు వేసి తాము హక్కుదారులమని వేధిస్తున్నారని పోలవరం గ్రామానికి చెందిన జయవరపు రాముడు అనే వృద్ధురాలు జేసీ ధాత్రి రెడ్డికి మొరపెట్టుకుంది. ఈ మేరకు స్పందించిన జేసీ ధాత్రిరెడ్డి సమస్య పరిష్కరించి తన ఇల్లు తనకు ఇప్పించి వారి నుంచి రక్షణ కల్పిస్తానని హామీ ఇచ్చారని బాధిత వృద్ధురాలు తెలిపింది.

ఆంజనేయ స్వామి ఆలయ హుండీ లెక్కింపు

పెదపాడు, మే 25(ఆంధ్రజ్యోతి) : అప్పనవీడు అభయాంజనేయ స్వామి ఆలయ హుండీ లెక్కింపు ద్వారా రూ.10లక్షల 80వేల 452 ఆదాయం లభించినట్టు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు తెలిపారు.దేవాలయ ప్రాంగణంలో ఆలయ అధికారులు, దేవాలయ సిబ్బంది, భక్తుల సమక్షంలో 67 రోజులకు గాను హుండీ లెక్కింపును సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి సురేశ్ కుమార్, ఈవో తారకేశ్వరరావు, వడ్డీ వాసవి, గరికిపాటి చంటి, వడ్డి రాము, భక్తులు పాల్గొన్నారు.



అర్జీ అందజేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన ఉపాధ్యాయులు

ఇంకెన్నాళ్లు!

- బదిలీ దరఖాస్తులకు అనుమతించండి
- కలెక్టర్‌కు టీచర్ల అభ్యర్థన

ఏలూరు అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి) : టెన్త్ పరీక్షల నిర్వహణలో మాల్‌ప్రాక్టీస్ అభియోగాలు ఎదుర్కొంటున్న 12 మంది ఉపాధ్యాయులు కలెక్టర్‌కు తమ ఆవేదనను విన్నవించారు. 2022 సంవత్సరంలో జిల్లాలో 12 మంది ఉపాధ్యాయులపై టెన్త్ పరీక్షల సమయంలో కేసులు నమోదయ్యాయి. అయితే ఆ కేసుల్లో ఇప్పటి వరకు ఎటువంటి పురోగతి లభించలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీల్లో తమకు అర్హత కల్పించాలని అభ్యర్థిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వికి సంబంధిత ఉపాధ్యాయులు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికలో అర్జీని అందజేశారు. గత ప్రభుత్వంలో తమపై అక్రమకేసులు బనాయించి రిమాండ్‌కు పంపించి సస్పెండ్‌చేయగా హైకోర్టు ఉత్తర్వులతో సస్పెన్షన్లను ఎత్తివేసిందన్నారు. కోర్టును ఆశ్రయించినందుకు గాను ప్రత్యేక జీవో తీసుకొచ్చి తమను సుదూర ప్రాంతాలకు అక్రమంగా బదిలీచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వాస్తవానికి శాఖాపరమైన విచారణ నివేదిక ఇప్పటికే డీఈవో వద్ద ఉన్నందున తమ పేర్లను సీనియార్టీ జాబితాల్లో చేర్చి బదిలీలకు మరో నాలుగు రోజులే గడువు ఉన్నందున దరఖాస్తుకు అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు. ఇదే విషయమై డీఈవోను వివరణ కోరగా కలెక్టర్‌కు టీచర్లు అందజేసిన అర్జీ అందిందని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఉపాధి పనులపై ఎమ్మెల్యే బాలరాజు సమీక్ష

జీలుగుమిల్లి, మే, 26(ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులపై ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సంబంధిత అధికారులతో బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో సోమవారం సమీక్షించారు. నియోజకవర్గానికి రూ.60 కోట్లు మంజూరు చేసింద, పనికి సరిపడా వేతనం అందేలా చూడటంతో పాటు ఎటువంటి అవినీతికి తావులేకుండా పనులు చేయించాలన్నారు. సమీక్షలో పోలవరం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు, టి.నరసాపురం, కొయ్యలగూడెం సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన సలహా మండలి ఏర్పాటు చేయాలి

బుట్టాయగూడెం, మే 26(ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం వెంటనే గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏజెన్సీకి ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని, గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలని కోరుతూ చేపట్టిన దీక్షలు సోమవారం 13వ రోజుకు చేరాయి. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు దీక్షలను విరమించబోమని ఆదివాసీ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. జీవో -3 రద్దుతో తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఈ దీక్షల్లో కుంజా వెంకటేశ్వరరావు, సర్పంచ్ రవ్వా చంద్రకళ నాగు, నక్కా రవితేజ, కుంజా గంగరాజు, పొడియం కొవ్వాడయ్య, పొడియం రవీంద్ర, పొడియం వెంకన్నబాబు తెల్లం సూరమ్మ, తెల్లం ప్రియాంక, పైదా ముత్యాలరావు పాల్గొన్నారు.

టీడీపీ మండలాధ్యక్షుడిగా చలపతిరావు

లింగపాలెం, మే 25(ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండలాధ్యక్షుడిగా గరిమళ్ల చలపతిరావును నియమిస్తున్నట్టు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. మండలంలో నియోజకవర్గ రైతు సంఘ అధ్యక్షుడు మోరంపూడి మల్లికార్జునరావు నివాసంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా గరిమళ్ల చలపతిరావును నియమిస్తున్నట్టు తెలిపారు. మండలంలో పార్టీ అభివృదికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మోరంపూడి మల్లికార్జునరావు, తాళం సోంబాబు, ఎం.వరప్రసాద్, బి.రాంబాబు, సి.హెచ్.రామ్మోహన్‌రావు, టి.రాధాకృష్ణ, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి

కుక్కునూరు, మే 26(ఆంధ్రజ్యోతి) : పోలవరం నిర్వాసితులందరికీ న్యాయం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎం.వెంకటాచారి అన్నారు. సోమవారం కుక్కునూరులో జరిగిన సీపీఐ మండల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును 45.72 కాంటూరు లెవెల్లో నిర్మించాలన్నారు. నిర్వాసితులందరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కచ్చితంగా అమలు చేయాలన్నారు. అలాగే పోడుభూమి సాగు చేసుకుంటున్న వారికి హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 29న కుక్కునూరులో జరిగే సీపీఐ మండల 16వ మహా సభను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు కొన్నే లక్ష్మయ్య, శ్యామలా, బాబూరావు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

చింతలపూడి, మే 26(ఆంధ్రజ్యోతి) : ప్రగడవరం మేజర్ పంచాయతీలో రైతులకు పశుసంవర్ధక శాఖ 50 శాతం సబ్సిడీపై పశువుల దాణాను అందజేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ గ్రామాధ్యక్షుడు టి.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ బస్తా 1,110 రూపాయలు కాగా 50 శాతం సబ్సిడీపై నాలుగు టన్నులు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కె.రాజశేఖరరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

చింతలపూడి, మే 26 (ఆంధ్రజ్యోతి) : సీజన్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సూచించారు. చింతలపూడి ఏరియా ఆసుపత్రిని పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోగుల నుంచి ఫిర్యాదులు రాకుండా మంచి సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.నారాయణరావు, డాక్టర్ దీప్తి, డాక్టర్ విజయలక్ష్మి, అభివృద్ధి కమిటీ సభ్యులు కోండ్రు దేవ, జి.భారతి పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడుల్లో సారా పట్టివేత

చింతలపూడి, మే 26(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి పలుచోట్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ సి.హెచ్.అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నాగిరెడ్డిగూడెంలో మూడు సారా స్థావరాలపై దాడులు నిర్వహించి భూక్యా శ్రీను, వడ్డియ బాలరాజు, వడ్డియ రామదాసుకు సంబంధించిన వంద లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 43 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న వీరిపై కేసులు నమోదు చేశారు. తిమ్మిరెడ్డిపల్లి గ్రామంలో దాడిజరిపి కొనకళ్ళ చిన్నారావు నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.అదేవిధంగా అధికారుల ఆధ్వర్యంలో నామవరం గ్రామంలో సారా నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఫణికుమార్, సురేంద్ర, గిరి, సుధాకర్, చింతలపూడి సీఐ పి.అశోక్, జగ్గారావు పాల్గొన్నారు.

రజకుల అభివృద్ధికి సహకరించాలి

ఏలూరు రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి) : రజకులు ఆర్థికాభివృద్ధికి సహకరించాలని రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. ఏలూరులోని జిల్లా రజక జనసంఘం కార్యాలయంలో సోమవారం మహాసభ జరిగింది. గ్రామాల్లో రజకులకు కేటాయించిన చెరువులు, సాంఘికరక్షణ, ఎన్నికల హామీలు, రజక కమిటీల రిజిస్ట్రేషన్‌ల గురించి చర్చించి తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. జిల్లా గౌరవ యూత్ కార్యదర్శి విటాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన మహాసభలో బి.శ్రీనివాసు, పగడాల సాంబశివరావు, లక్ష్మీప్రసన్న, బూరుగుపల్లి శ్రీనివాసరావు, చీపురుపల్లి అప్పారావు, బుద్దారం గోపిరాజు, కె.మురళి పాల్గొన్నారు.

ఈఏపీ పరీక్షకు 40మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఈఏపీ పరీక్షల్లో భాగంగా ఇంజనీరింగ్ ప్రవేశాలకు జరుగుతున్న ఆన్‌లైన్ పరీక్షలకు సోమవారం స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ పరీక్ష కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం షిఫ్టుల్లో 153 మంది విద్యార్థులు, 154 మంది, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రంలో 147, 144, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 171, 165 మంది హాజరయ్యారు. మొత్తంమీద 40మంది గైర్హాజరయ్యారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షకు 950 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన సోషల్ స్టడీస్ పరీక్షకు జిల్లాలో 3,207 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 2257 మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. సార్వత్రిక విద్యాపీఠం దూర విద్య ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో భాగంగా జరిగిన ఫిజిక్సు పరీక్షకు 38 మందికిగాను 30, కెమిస్ట్రీ 33మందికి 31, జువాలజీ 30మందికి 28 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

ఎఫ్ఎల్ఎన్ శిక్షణను వాయిదా వేయండి

ఏలూరు అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : సాధారణ బదిలీల కారణంగా ఈ నెల 27 నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను వాయిదా వేయాలని యూటీఎఫ్ జిల్లా నాయకులు రవికుమార్ నేతృత్వంలోని ఉపాధ్యాయబృందం సోమవారం సమగ్రశిక్ష ఏపీసీ పంకజ్ కుమార్‌ను కలుసుకుని అభ్యర్థించింది. పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని ఐదు కొత్తజిల్లాల డీఆర్పీలకు కలిపి ఈ శిక్షణ తరగతులను అమలాపురం సమీపంలోని ఓడలరేవు ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేయడంపై అభ్యంతరం తెలియజేస్తూనే, ప్రస్తుతం టీచర్ల బదిలీలు జరుగుతున్నందున వీటిని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ఏపీసీ పంకజ్ కుమార్ మాట్లాడుతూ ఏసీ సదుపాయం ఉన్న భవనంలోనే శిక్షణ తరగతులు నిర్వహించాలని ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో అమలాపురంలోని ఓడలరేవు ఇంజనీరింగ్ కళాశాలను ఎంపిక చేయాల్సి వచ్చిందన్నారు. శిక్షణ తరగతుల వాయిదాకు యూటీఎఫ్ అభ్యర్థనను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.



● బుట్టాయగూడెం మండలం దొరమామిడి గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలో 1997-2002 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి గురువులు ఎం.భీమేశ్వరావు, వి.అప్పారావు, కె.లక్ష్మీనారాయణ, పి.సుందరమ్మ, ఎం.రామారావు, సి.సోమ రాజు, పీడీ దుర్గారావు, రామిరెడ్డి, పి.గంగారత్నంలను ఘనంగా సన్మానించారు.



ర్యాలీలో పాల్గొన్న మహిళలు

ఉత్సాహంగా మహిళల తిరంగా ర్యాలీ

ఏలూరు రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులపై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయాన్ని కీర్తిస్తూ త్రివిధ దళాలకు శుభాకాంక్షలు తెలుపుతూ సోమవారం సాయంత్రం రాష్ట్ర సేవిక సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.విక్రమ్ కిషోర్ ప్రారంభించారు. రామచంద్రరావుపేట,గంగానమ్మ ఆలయం వద్ద నుంచి ర్యాలీ పురవీధులు గుండా సాగింది. మహిళలు ఉత్సాహంగా పాల్గొని త్రివర్ణ పతకాలతో "జైహింద్ జై భారత్" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో మహిళా సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు నంగులూరి నీరజ, సౌజన్య, రాధాకుమారి, వెంకటేశ్వర్లు, చారుమతి పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి గ్రామోత్సవం



బుట్టాయగూడెం, మే 26(ఆంధ్రజ్యోతి) : హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం హైస్కూల్ వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి గ్రామోత్సవాన్ని మండల కేంద్రంలో కమిటీవారు ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టరుపై పురవీధుల్లో ఊరేగించారు. ఈ నెల 28న ఆలయం వద్ద జరిగే అఖండ అన్నసమారాధనను జయప్రదం చేయాలని కోరారు.

మృతదేహాలను అప్పగించటంలో అలసత్వం అమానుషం

చాట్రాయి, మే 27(ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారి మృతదేహాలు అప్పగించటానికి ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు అలసత్వం వహించటం అమానుషమని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి హరనాథ్ విమర్శించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మృతదేహాలు అప్పగించమని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా పాలకులు పట్టించుకోకపోవటం దారుణమన్నారు. మృతుల బంధువుల హృదయాలు గాయపడకుండా అంత్యక్రియలు వారి స్వగ్రామంలో జరుపుకోవటానికి కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు అవసరమైన చర్యలు తీసుకోవాలని హరనాథ్ డిమాండ్ చేశారు.

విద్యార్థులు క్రీడల్లోను రాణించాలి



కలిదిండి, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను రాణించాలని కోరుకొల్లు, కలిదిండి గ్రంథాలయాల అధికారులు రామవులు, జె.రమేష్‌బాబు అన్నారు. సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా కోరుకొల్లు, కలిదిండి గ్రంథాలయాల్లో విద్యార్థులకు చెస్, ఆటల పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నేర్పించారు. జనరల్ నాలెడ్జ్ పుస్తకాలపై అవగాహన కల్పించారు.

హిల్ సంస్థ సేవలు అభినందనీయం



కృత్రిమ కాలు అందిస్తున్న నాగేశ్వరరావు

ఆగిరిపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి) : హిల్ సంస్థ సేవలు అభినందనీయమని రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ కార్యాలయం అడిషనల్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో హిల్ కృత్రిమ అవయవ కేంద్రంలో ప్రముఖ సంఘ సేవకులు చుండూరి మధుసూదనరావు అందించిన విరాళంతో గుంటూరుకు చెందిన కుప్పగిరి గాంధీకి కృత్రిమ కాలును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందలాది మంది ఇబ్బందులలో ఉన్నా బాలబాలికలకు ఉచిత విద్య, వసతి కల్పించడంతో పాటు, అంధ విద్యార్థులకు సాధారణ విద్య, బ్రెయిలీ లిపి, కంప్యూటర్ విద్య, సంగీత శిక్షణలందించడం, దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో హిల్ సీఈవో కూరపాటి అజయ్‌కుమార్, సీనియర్ టెక్నీషియన్‌కి చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

వైన్‌షాపులో ఫేక్ ఫోన్‌పేతో మోసం

ఇద్దరిని పట్టుకున్న షాపు సిబ్బంది.. మరొకరు పరారీ

ముదినేపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి) : వైన్‌షాపుల్లో మద్యం బాటిళ్ల కొనుగోలు చేసి ఫోన్ పే ద్వారా సొమ్ము పంపామని చెప్పి ఓ ముఠా చేస్తున్న మోసం వెలుగులోకి వచ్చింది. ముదినేపల్లి మండలం సింగరాయపాలెంలోని వైన్స్ షాపులో ఈ సంఘటన ఇటీవల జరిగింది. ఈ నెల 12న ముగ్గురు వ్యక్తులు వైన్‌షాపునకు వచ్చి రూ.12500 విలువైన ఫుల్‌బాటిల్స్ కొనుగోలు చేసి ఫోన్‌పే చేశామని చెప్పి వెళ్ళిపోయారు. తిరిగి 19న ఆ వ్యక్తులే వచ్చారు. 6వేల విలువైన మద్యం ఫుల్ బాటిళ్ల కొనుగోలు చేసి ఫోన్ పే చేశామన్నారు. ఫోన్‌పే చేశామని, సౌండ్ వచ్చింది అంటూ చెప్పి హడావుడిగా వెళ్ళిపోయారు. అయితే ఆ వైన్స్ షాపు నుంచి ఎటువంటి ఇబ్బంది లేకపోవడం గమనించిన ఆ ముగ్గురు వ్యక్తులు ఈనెల 22న మళ్ళీ వచ్చి మద్యం బాటిళ్ల అడిగి ఫోన్‌పే నెంబర్ అడిగారు. దీంతో గతంలో రెండుసార్లు ఫోన్‌పే ద్వారా వేశామన్న సొమ్ము బ్యాంకు ఖాతాలో జమకాని విషయాన్ని వైన్స్‌షాపు సిబ్బంది గుర్తించారు. దీనితో ఆ ముగ్గురు వ్యక్తులు బైక్‌పై పారిపోయారు. వారిని వెంబడించి పట్టుకోగా, ఫేక్ ఫోన్ పే చేసిన ప్రధాన వ్యక్తి తప్పించుకుని పారిపోయాడు. మిగిలిన ఇద్దరిని పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

ముదినేపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం దేవపూడి రోడ్డు వద్ద గతనెల 30న మోపెడ్ పై నుంచి కిందపడి తీవ్ర గాయాలకు గురైన వణుదుర్రు గ్రామానికి చెందిన చిన్నం బేబి (50)మృతి చెందింది. గుడ్లవల్లేరు మండలం కూరాడ వెళ్ళి వస్తుండగా ఈ సంఘటన జరిగింది. తలకు బలమైన గాయాలకు గురికాగా మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడి నుంచి విజయవాడ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆమె సోమవారం మరణించింది. దీనిపై కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని మోటార్ సైక్లిస్టు మృతి





లారీ ఢీకొని మృతి చెందిన కోటేశ్వరరావు (ఇన్‌సెట్‌లో) ఫైల్‌ఫొటో

కైకలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): చేపలలోడు లారీ ఢీకొని మోటార్ సైక్లిస్టు మృతి చెందాడు. సోమవారం కైకలూరు పట్టణంలోని రైతు బజారు వద్ద గ్రామానికి చెందిన మంచికంటి కోటేశ్వరరావు(70) ద్విచక్ర వాహనంపై వెళుతుండగా లారీ ఢీకొట్టింది. మండలంలోని ఆటపాకలో చేపలలోడు చేసుకుని పామర్రు వెళుతున్న లారీ డ్రైవర్ వెనుక నుంచి బైకును ఢీకొట్టి మూడు కిలోమీటర్లు లారీ నిలుపుదల చేయకుండా పరారయ్యాడు. అదే సమీపంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు హుటాహుటిన లారీని వెంబడించి భైరవపట్నం రైల్వేగేటు సమీపాన నిలిపివేశాడు. మృతుడు కైకలూరు పట్టణంలో కిరాణా వ్యాపారం చేసుకుని జీవిస్తున్నాడు. ఈ ప్రమాదంపై మృతుని కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్సై డి.వెంకట్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ సైక్లిస్టుకు గాయాలు



ఆగిరిపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి) : వాహనం ఢీకొని ఆగిరిపల్లికి చెందిన ముత్యాల సుధాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం రాత్రి ఆగిరిపల్లి సమీపంలో బిస్ స్కూల్ వద్ద ఈ ప్రమాదం జరిగినది. విజయవాడ నుంచి ఆరిగిపల్లికి ద్విచక్రవాహనంపై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని విజయవాడ ఆస్పత్రికి తరలించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

మట్టి రోడ్డుకు మోక్షమెప్పుడో..?

గత పాలకుల నిర్వాకంతో నిలిచిన నిర్మాణ పనులు



రమణక్కపేట-కొండపర్వ రహదారి దుస్థితి

మునుసూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): పాలకులు మారినా గ్రామాలకు వెళ్ళే రోడ్ల స్థితిగతులు మాత్రం మారడం లేదు. రమణక్కపేట నుంచి విసన్నపేట మండలం కొండపర్వ వెళ్ళే మట్టి రోడ్డుతో ఎన్నో ఏళ్ళ నుంచి ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రమణక్కపేట నుంచి కొండపర్వ వెళ్ళే లింక్ రోడ్డును సూమారు 3 కిలోమీటర్ల పొడవునా తారు రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.2.10కోట్లు నిధులను మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ రూ.70లక్షల మేర పనులు చేసి, మధ్యలో నిలిపివేశాడు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని విస్మరించడంతో ఈ రహదారి మరింత అధ్వానంగా తాయారైంది. గత ప్రభుత్వంలో బిల్లులు వస్తాయో లేదోనన్న భయంతో కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టలేదు. ఈ రహదారిని అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వ హయాంలో ధర్నాలు, ఆందోళనలు చేసినా పట్టించుకోలేదు. నూతన ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారులను అభివృద్ధికి శ్రీకారం చుట్టి, ఏడాది పూర్తవుతున్నా నేటికి ఈ రహదారి అభివృద్ధికి నోచుకోలేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైన కేటాయించిన నిధులను విడుదల చేసి అధ్వానంగా మారిన ఈ రహదారిని బీటీరోడ్డుగా అభివృద్ధి చేసేలా మంత్రి పార్థసారథి, జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేస్తే పనులు ప్రారంభిస్తాం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన నిధులను ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం నిధులను మధ్యలో అపివేసింది. ప్రస్తుత ప్రభుత్వం నిధులను విడుదల చేస్తే రహదారి అభివృద్ధి పనులను ప్రారంభిస్తాం.

- రేగళ్ళ దుర్గాప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ, మునుసూరు మండలం

కడపకు తరలిన టీడీపీ నాయకులు



చాట్రాయి నుంచి బయలుదేరిన టీడీపీ నాయకులు

కలిదిండి, మే 26 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహించే టీడీపీ మహానాడుకు సోమవారం కలిదిండి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కార్లు, బస్సుల్లో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాస్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, నాయకులు మోరా రాంబాబు, తిరుమలశెట్టి పరశురాముడు, వాతాడి రాంబాబు, మోకా నాగమల్లేశ్వరరావు, అండ్రాజు దుర్గా ప్రసాద్, కొప్పనాతి రాము తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: కడప జిల్లా పచ్చాపురంలో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి ముదినేపల్లి మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. మండలంలోని 32 గ్రామాల నుంచి సుమారు 200 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు సోమవారం వెళ్లారు. టీడీపీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, నాయకులు చలసాని జగన్మోహన్‌రావు, బొప్పన సుందర రామయ్య, దావు నాగరాజు, యర్రా రాంబాబు, పరసా విశ్వేశ్వరరావు, కందేపి పద్మ తదితరుల నాయకత్వంలో కార్యకర్తలు తరలి వెళ్లారు.

చాట్రాయి: కడపలో మూడు రోజుల పాటు జరిగే టీడీపీ మహానాడుకు చాట్రాయి మండలం నుంచి మంగళవారం తెలుగుదేశం నాయకులు బయలుదేరి వెళ్లారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పలగాని దుర్గారావు, నూజివీడు నియోజకవర్గ తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి మండలపు జగదీష్, టీడీపీ నాయకులు నాగమల్లి వెంకటేశ్వరరావు, చెన్నారావు కారులో ఎన్టీఆర్ జోహార్, తెలుగుదేశం జిందాబాద్, చంద్రబాబు, లోకేశ్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేసుకుంటూ వెళ్ళారు.

ఫీడింగ్ పాఠశాలల విద్యార్థులకు

హైస్కూల్ విద్య దూరం

మూడు యూపీ స్కూళ్ల రద్దుతో ఆరు గ్రామాల విద్యార్థులకు ఇబ్బందులు



బేసిక్ ప్రైమరీ పాఠశాలగా మారిన ముదినేపల్లి మండలం దాకరం యూపీ పాఠశాల

ముదినేపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ప్రభుత్వం తీసుకువస్తున్న తొమ్మిది బడుల వ్యవస్థలో అప్పర్ ప్రైమరీ పాఠశాలలు కనుమరుగు కానుండటంతో ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న 6, 7, 8 తరగతుల చదువులు దూరం కానున్నాయి. రద్దు కానున్న యూపీ పాఠశాలలు ఉన్న గ్రామాల విద్యార్థులతోపాటు ఆయా యూపీ పాఠశాలల ఫీడింగ్ ఎలిమెంటరీ పాఠశాలల్లో ఐదు నుంచి ఆరవ తరగతికి ప్రమోట్ అయ్యే విద్యార్థులు కూడా ఇబ్బందులనెదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముదినేపల్లి మండలంలో తొమ్మిది యూపీ పాఠశాలలు రద్దు కాగా, దాకరం, దేవపూడి, కొరగుంటపాలెం యూపీ పాఠశాలలకు ఫీడింగ్ ప్రాథమిక పాఠశాలలున్నాయి. దీంతో పై మూడు యూపీ పాఠశాలలు ఉన్న గ్రామాల విద్యార్థులతోపాటు ఫీడింగ్ ప్రాథమిక పాఠశాలల గ్రామాల విద్యార్థులకు కూడ 6, 7, 8 తరగతుల చదువులు దూరమయ్యాయి. దాకరం యూపీ పాఠశాల ఎత్తేయటంతో పేరూరు, పెయ్యేరు ఎలిమెంటరీ పాఠశాలల విద్యార్థులు ఐదవ తరగతి నుంచి ఆరవ తరగతిలో చేరాలంటే 3 నుంచి 6 కిలోమీటర్ల దూరంలోని ముదినేపల్లి హైస్కూలుకు వెళ్లాల్సి ఉంది. ఇప్పటి వరకు దాకరం విద్యార్థులు సొంత గ్రామంలో 6, 7, 8 తరగతులు చదివే వారు పెయ్యేరు, పేరూరు విద్యార్థులు సుమారు కిలోమీటరు దూరంలోని దాకరం యూపీ పాఠశాలలో పైతరగతులు చదివే వారు. ఇప్పుడు దాకరం యూపీ పాఠశాల బేసిక్ ప్రైమరీ పాఠశాలగా మారటంతో 6,7,8 తరగతులకు ముదినేపల్లి హైస్కూలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రద్దీగా ఉండే జాతీయ రహదారి వెంబడి కిలోమీటర్ల దూరంపై గ్రామాల విద్యార్థులు ముదినేపల్లి వెళ్లటం ఇబ్బందికరమే. ఇక దేవపూడి యూపీ స్కూలు రద్దు కావటంతో ఆ గ్రామంతోపాటు ఫీడింగ్ ఎలిమెంటరీ పాఠశాల ఉన్న ప్రొద్దువాక విద్యార్థులు ఐదు నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలోని కోరుకొల్లు హైస్కూలుకు, కొర్రగుంటపాలెం యూపీ స్కూల్ రద్దు వల్ల ఆ గ్రామంతోపాటు ఫీడింగ్ పాఠశాలలైన గోకినంపాడు విద్యార్థులు దూరంగా ఉన్న అల్లూరు, బొమ్మినంపాడు హైస్కూళ్లకు 6,7,8 తరగతులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ధర్మకర్తల నియామకంపై కసరత్తు

ముదినేపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలోని దేవస్థానాలకు ధర్మకర్తల మండళ్ల ఏర్పాటుకు ముదినేపల్లి మండలంలో కసరత్తు ప్రారంభమైంది. మండలంలోని ఆరు దేవస్థానాలకు ధర్మకర్తల మండళ్ల నియామకానికి ఇటీవల దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రరావు నోటిఫికేషన్ జారీ చేయటంతో గ్రామాల్లో ఎన్‌డీఏ కూటమి నాయకులు ఛైర్మన్, సభ్యుల ఎంపికకు చర్చిస్తున్నారు. మండలంలోని గురజ శ్రీ గంగా పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, వడాలి సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి, సింగరాయపాలెంలోని గంగా పార్వతి సమేత అమృతదేశ్వరస్వామి, లక్ష్మీనృసింహస్వామి దేవస్థానాలు, కోడూరులోని లోకేశ్వర జనార్దన స్వామి దేవస్థానాలకు ధర్మకర్తల మండళ్ల నియామకంపై ఆయా గ్రామాల్లో ఎన్‌డీఏ నాయకులు దృష్టి సారించారు. సింగరాయపాలెం లక్ష్మీ నృశింహ దేవస్థానం ఛైర్మన్ పదవికి అభ్యర్థి ఎంపిక పూర్తి కాగా, మిగిలిన ఐదు దేవస్థానాల ఛైర్మన్ల పదవులు, సభ్యుల పదవులకు అభ్యర్థుల ఎంపికకు నాయకుల మధ్య చర్చలు సాగుతున్నాయి. గ్రామాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ మధ్య సమన్వయం సాధించి అభ్యర్థులను ఎంపిక చేయాలన్నది ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఉద్దేశంగా ఉంది. ఛైర్మన్ పదవుల పంపకాల్లో నాలుగు దేవస్థానాలు టీడీపీకి, ఒక దేవస్థానం జనసేనకు, ఒక దేవస్థానం బీజేపీకి కేటాయిస్తున్నట్లు తెలిసింది.



గాదిరాజు కుటుంబీకులను పరామర్శిస్తున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

గాదిరాజు కుటుంబీకులకు పరామర్శ

మండవల్లి మే 26(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం భైరవపట్నంలో చేపల రైతుల అసోసియేషన్ నాయకులు గాదిరాజు భాస్కర్‌వర్మ సతీమణి భారతి మరణించడంతో తెలుగుదేశం, వైసీపీ నాయకులు సోమవారం గాదిరాజు కుటుంబీకులను పరామర్శించారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు తదితరులు భారతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర చేపలరైతు సంఘం మాజీ అధ్యక్షుడు ముదునూరి సీతారామరాజు, కూటమి నేతలు బీకెఎం నాని, చలసాని జగన్మోహనరావు, పెన్మెత్స త్రినాధరాజు, చదలవాడ శేషగిరిరావు, ఎంపీపీలు అడవి కృష్ణ, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ పరామర్శించారు.

ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌కు మంత్రి కొలుసు అభినందన

ఏలూరు, మే 26(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా నియమితులైన ఆలపాటి సురేశ్‌ను రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అభినందించారు. ప్రెస్ అకాడమి ఛైర్మన్‌గా సురేశ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిందని ఒక ప్రకటనలో తెలిపారు. సురేశ్ నాయకత్వంలో జర్నలిస్టులకు ఎంతగానో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నలిజంలో కొనసాగుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రభుత్వం ద్వారా సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని మంత్రి కోరారు.

సుబ్రహ్మణ్య స్వామికి శాంతి కల్యాణం



ముదినేపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం స్వామి వారికి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. కృత్తికా నక్షత్రం సందర్భంగా అర్చకులు తోలేటి వీరభద్ర శర్మ, గూడూరు శివరామకృష్ణ శర్మ ఈ శాంతి కల్యాణాన్ని పలువురు దంపతులచే జరిపించారు. దేవస్థానం ఏసీ ఆర్.గంగాశ్రీదేవి కల్యాణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

28న లక్ష మల్లెల పూజ

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 28న లక్ష మల్లెల పూజ జరుగుతుందని ఏసీ గంగా శ్రీదేవి తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనే భక్తులు రూ.1116 చెల్లించి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

కాల్వ ఆక్రమించి రొయ్యల చెరువు తవ్వకం

తహసీల్దార్‌కు వైవాక రైతుల ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైవాక రైతులు

ముదినేపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వైవాక గ్రామ ఏరియాలోని పంట కాలువను, కాల్వ పోరంబోకు భూమిని ఆక్రమించి రొయ్యల చెరువును తవ్వించటంపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ముదినేపల్లి తహసీల్దార్ పవన్ కుమార్‌కు రైతులు దాసరి అబ్రహం, అరిగెల యోహాన్ వినతి అందజేశారు. ఆగ్రామ ఏరియాలోని ఆర్ఎస్ నెంబర్లు 600, 601లో కాల్వ వెంబడి ఉన్న 2.42 ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక వ్యక్తి ఆక్రమించి రొయ్యల చెరువు తవ్వించి, బోర్లు వేయించారని ఫిర్యాదు చేశారు. అడిగిన దళిత రైతులపై దౌర్జన్యం చేస్తున్నారని పేర్కొన్నారు. కాలువ ఆక్రమణ వల్ల ప్రభుత్వం దళితులకు పట్టాలిచ్చిన భూములకు నీరు వెళ్లటం లేదని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకుని కాల్వ ఆక్రమణలను విడగొట్టాలని కోరారు. ఆక్రమణలు గుర్తించేందుకు సర్వే చేయించాలని కోరగా, వీఆర్‌వో తన వద్ద నుంచి రూ.26 వేలు తీసుకుని సరిగ్గా సర్వే చేయలేదని అబ్రహం ఫిర్యాదు చేశారు.

70 శాతం సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

మునుసూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులకు 70శాతం సబ్సిడీపై విత్తనాలు అందిచాలని రాష్ట్ర రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు కోరారు. సోమవారం రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి రైతుసంఘం నాయకులు వినతపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా అందించే అన్నిరకాల విత్తనాలను 70శాతం సబ్సిడీపై ఇవ్వాలన్నారు. సాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని, గత ఏడాదిలో పండించిన వరి, మిర్చి, నాటు, బల్లి పొగాకు, కోకో తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. పంటల ధర సగానికి సగం పడిపోవడంతో రైతులు అప్పులపాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయని, తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. క్వింటా మిర్చి రూ. 20వేలు, నాటుపొగాకు రూ.10వేలు తగ్గకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆత్మహత్యల నుంచి కాపాడాలన్నారు. ఈ కార్యాక్రమంలో కూచిపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా సైకిల్ యాత్ర



11,11,111 మొక్కలు నాటడం లక్ష్యం

సైకిల్ యాత్రికుడు ముత్తు సెల్వం

నూజివీడు టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా తమిళనాడుకు చెందిన ముత్తు సెల్వం అనే యువకుడు దేశవ్యాప్తంగా సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నాడు. ఈ యాత్రలో భాగంగా సోమవారం నూజివీడు చేరుకున్నాడు. ఈ సందర్భంగా విలేకరులు మత్తు సెల్వంను పలకరించగా తన లక్ష్యాన్ని వివరించారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యం దిశగా సైకిల్‌యాత్రకు ఉపక్రమించినట్లు వివరించారు. తన సైకిల్‌కు గేర్లు లేవని, 122 కిలోల బరువైన సైకిల్‌ను తాను యాత్రకు వినియోగిస్తున్నట్లు, నెత్తిపై సేఫ్టీగార్డుగా హెల్మెట్, ఆ హెల్మెట్‌కు కెమెరా అమర్చినట్లు వివరించారు. 11,11,111 మొక్కలు నాటడం లక్ష్యంగా 40వేల కిలోమీటర్లు యాత్ర కొనసాగించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం తమిళనాడులోని కోయంబత్తూరులో 2021 డిసెంబర్ 21 ప్రారంభమైన యాత్ర దేశం మొత్తం పర్యటించి 2027 డిసెంబర్ 21న ముగుస్తుందన్నారు. ఇప్పటి వరకు 37,860 కిలోమీటర్లు యాత్ర సాగగా 7లక్షల96,240 మొక్కలు నాటినట్లు తెలిపారు. ఏ సంస్థల మద్దతులేదని తన వ్యక్తిగత ఆశయం మేరకు సొంత ఖర్చులతో యాత్ర కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు యాత్ర కొనసాగించి సమీపంలో పెట్రోల్ బంక్‌లలో బస చేస్తున్నట్లు తెలిపారు.

ఆక్వా మందుల షాపు వద్ద రైతుల ఆందోళన

- ▸▸ నకిలీ మందులు విక్రయిస్తున్నారంటూ ఆరోపణ
- ▸▸ రూ.9 లక్షల విలువైన చేపపిల్లలు మృతి చెందాయని ఆవేదన ▸▸ పోలీసుల రంగ ప్రవేశం



మృతి చెందిన చేప పిల్లలు ఎదుట దిగాలుగా కూర్చున్న బాధిత రైతు

కైకలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆక్వా మందుల దుకాణంలో కల్తీ మందులు విక్రయిం చడం వల్లనే చేపపిల్లలు మృతి చెందాయని రైతులు ఆందోళన చేశారు. సోమవారం రాత్రి కైకలూరు టౌన్‌లోని వారపు సంత వద్ద ఉన్న ఎ టు జెడ్ ఆక్వా రైతుబజారు దుకాణం వద్ద ఆందోళన చేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు మండవల్లి మండలం లోకుముడి గ్రామానికి చెందిన రైతు తలారి కిరణ్ కొరమేను చేపపిల్లలను పెంపకం చేస్తున్నాడు. కొరమేను చేపపిల్లకు జిగురు(గర్రి) వచ్చిందని ఎటుజెడ్ ఆక్వాబజారులో మందు కొనుగోలు చేశాడు. ఒక్కొక్క లీటరు మందు రూ.180 చొప్పున 2 లీటర్లను కొనుగోలు చేశాడు. అరలీటరు మందును పిచికారిచేయాలని దుకాణదారుడు సూచించారు. తీసుకువెళ్లిన మందును కొరమేను చేపపిల్లలున్న కుండీలో నాలుగు మూతల మందును కిరణ్ వేశాడు. పది నిమిషాల వ్యవధిలోనే కుండీలోని చేపపిల్లలు మృతి చెందడం ప్రారంభమైనట్లు గుర్తించాడు. హుటాహుటిన దుకాణం వద్దకు వచ్చి జరిగిన విషయాన్ని వారికి వివరించగా వారు అడ్డగోలుగా సమాధానమిచ్చారు. తమ మందు వల్ల చేపపిల్లలు చనిపోలేదని వాదనలు చేశారు. దుకాణం నుంచి చేపపిల్లల వద్దకు వెళ్లగా కుండీలోని సుమారు 150000 కొరమేను చేపపిల్లలు మృత్యువాతపడ్డాయి. దీంతో మరికొన్ని చేపపిల్లలను తీసుకుని దుకాణం వద్దకు వచ్చి వారి ఎదుటే బక్కెటు నీటిలో చేపపిల్లలను వేసి వారు విక్రయించిన మందును కలిపాడు. దీంతో చేపపిల్ల అప్పటికప్పుడే మృతి చెందడం గమనించిన దుకాణదారులు సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేత ధోరణి చేయడమేగాక అతన్ని బయటకు పంపించి దుకాణం మూసివేసే ప్రయత్నం చేశారు. దీంతో తన బంధువులకు సమాచారం ఇచ్చిన రైతు వారంతా వచ్చి ప్రశ్నించగా దుకాణ యజమాని లేరని మాకు సంబంధం లేదంటూ వాదనలు చేశారు. దీంతో ఆగ్రహించిన రైతుకు అండగా వచ్చిన బంధువు లంతా ఆందోళనకు దిగారు. ఈ సమాచారం తెలుసుకున్న కైకలూరుటౌన్ పోలీసులు సంఘట నా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు వచ్చిన తరువాత దుకాణం మూసివేసే ప్రయత్నం చేయడంతో రైతు తరఫున వచ్చిన వారంతా అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. దీనితో పోలీసులు రైతు తరఫున వారిని బుజ్జగించారు. 150000 చేపపిల్లల ఖరీదు రూ.9లక్షలు ఉంటుందని తనకు నష్టపరిహారం చెల్లించాలని లేకుంటే చేప పిల్లలకు అమ్మిన మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని తలారి కిరణ్ హెచ్చరించాడు. వారి దుకాణంలో నకిలీమందులు, కాలం చెల్లిన మందులు విక్రయించడం వలనే ఈ దుస్థితి ఏర్పడిందని వారే నష్టపరిహారం చెల్లించాలని రైతులంతా పట్టుబట్టారు. దానితో పాటు దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.